నగరంపై నీలి మేఘాలు నల్లటి ఛత్రం పట్టాయి. వేసవి మాదిరి ఎండలతో అల్లాడుతున్న నగరవాసులకు కొద్దిసేపు ఆహ్లాదాన్ని పంచాయి. ప్రకాశం బ్యారేజీ వద్ద వరదకు పోటీ పడుతూ దట్టంగా కమ్ముకున్న ఈ మబ్బుల ప్రవాహానికి కొద్దిసేపు చిమ్మచీకట్లు కమ్ముకోగా, వర్ష ఆగమనాన్ని సూచిస్తూ ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా చల్లగా మారిపోయింది. ఓవైపు ప్రకాశం బ్యారేజీ అందాలు.. మరోవైపు వరద ప్రవాహ వయ్యారాలు.. ఇంకోవైపు మేఘాల సయ్యాటలు.. వెరసి ఆ ప్రాంతమంతా వర్షానికి ముందు జరిగే మబ్బుల యుద్ధంలా కనిపించినప్పటికీ.. చివరికి చినుకు చుక్క కూడా జారవిడల్చకుండా ఊరించి ఉసూరుమనిపించాయి. నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద బుధవారం సాయంత్రం కనిపించిన ఈ చిత్రం భలే ఉంది కదూ.

మేఘం కదిలెను.. వరదై పొంగెను..



బ్యారేజీ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



ఆపదేం లేదు.. అయినా అప్రమత్తం

ప్రకాశం బ్యారేజీ వద్ద వరదను పరిశీలించిన కలెక్టర్

విజయవాడ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదిలో వరద స్థిరంగా కొనసాగుతోందని, ముప్పేమీ లేదని, అయినా జిల్లా అధికార యంత్రాంగాన్ని, నదీ పరివాహకంలోని లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతోందని, రానున్న రెండు రోజుల్లో ప్రకాశం బ్యారేజీకి మూడు లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం మాత్రమే ఉందని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని హితవు పలికారు. ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వదిలిన నీటిని బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ ఆర్.మోహనరావు, కృష్ణా రివర్ కన్జర్వేటివ్ ఈఈ రావెళ్ల రవికిరణ్, డీఈ ఎస్.అజయ్‌బాబు, బ్యారేజీ జేఈ సత్యరాజేశ్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుంచి విడుదలవుతున్న నీటితో పులిచింత ప్రాజెక్ట్ నిండుకుందన్నారు. పులిచింతల నుంచి 60 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామని, ఈ నీటి ఉధృతి కారణంగా బ్యారేజీ 55 గేట్లను అడుగు మేర, 15 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి మిగతా 6లో..



ప్రమాదకరంగా ఉన్న బ్రేకర్లు ఇవే..

బ్రేకర్స్ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-గుంటూరు-విజయవాడ జాతీయ రహదారిపై వారధి ఫ్లైఓవర్ ముందు ఏర్పాటుచేసిన స్పీడు బ్రేకర్లను బుధవారం రాత్రి అధికారులు తొలగించారు. నేతాజీ బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరుగుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎన్‌హెచ్ఏఐ, ట్రాఫిక్ అధికారులు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఫ్లైఓవర్ దిగే మార్గంలో ఆరు, ఎక్కే మార్గంలో మూడు బ్రేకర్లు అమర్చారు. వీటివల్ల ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ఆరింటిలో మూడు, మూడింటిలో ఒక స్పీడు బ్రేకర్‌ను తొలగించారు. అయినా ట్రాఫిక్ అదే స్థాయిలో ఉండటంతో మూడింటిలో రెండు బ్రేకర్లను, రెండింటిలో ఒక బ్రేకర్‌ను బుధవారం రాత్రి తొలగించారు. రెండు వైపులా ఒక్కో బ్రేకర్‌ను ఉంచారు. ఫ్లైఓవర్ ఎక్కే, దిగే ప్రదేశంలో రేడియం బ్లింకర్లను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారికి రెండు వైపులా డేంజర్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

ఈవో శీనానాయక్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్



దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం

దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్

దుర్గగుడిలో ఉత్సవ ఏర్పాట్లు, అభివృద్ధి పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న దసరా మహోత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ మిగతా 6లో..

మాయదారి మలుపులు

» నిబంధనల ప్రకారం జాతీయ రహదారులపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయకూడదు. స్పీడు బ్రేకర్లు ఏర్పాటుచేస్తే అది జాతీయ రహదారి ఎందుకవుతుంది? రాష్ట్ర రహదారి అవుతుంది. : ఓ కారు యజమాని అభిప్రాయం.

» నగరంలోని నేతాజీ వంతెన నుంచి కృష్ణలంక పోలీసు స్టేషన్ వరకు ఉన్న స్ట్రెచ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మూడు నెలల్లో పదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క నేతాజీ బ్రిడ్జి దగ్గరే ఈ నెలలో ముగ్గురు చనిపోయారు. : ఓ పోలీసు అధికారి చెప్పిన లెక్క.

» బందరు రోడ్డులోకి రావాలంటే మేం జాతీయ రహదారి దాటాలి. పగటి పూట రోడ్డు దాటుతుంటే పోలీసులు ట్రాఫిక్ ఆపుతున్నారు. రాత్రిపూట ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని రోడ్డు దాటాల్సి వస్తోంది. : ఓ పాదచారి మాట.



అమెరికన్ ఆసుపత్రి వద్ద డేంజర్ వంతెన



నేతాజీ బ్రిడ్జి వద్ద ప్రమాదకర ప్రాంతమిదే..

డేంజర్ జోన్‌గా నేతాజీ బ్రిడ్జి-పీఎన్‌బీఎస్ మార్గం

గత మూడు నెలల్లో పదిమంది దుర్మరణం

- నేతాజీ బ్రిడ్జి వద్ద రోడ్డు దాటాలంటే పద్మవ్యూహమే
- సరైన మార్గనిర్దేశం లేక పాదచారులకు అష్టకష్టాలు
- తాజా స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులకు సమస్య
- మసీదు వద్ద బాటిల్ నెక్‌తో ఇరుగ్గా రహదారి
- ఎదురెళ్లి ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- అమెరికన్ ఆసుపత్రి వద్ద పరిస్థితి మరీ ఘోరం
- ఇక్కడి వంతెన రోడ్డుకు డౌన్‌లో ఉండటంతో ప్రమాదాలు
- ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-గుంటూరు, మచిలీపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారులపై నేతాజీ బ్రిడ్జి నుంచి పీఎన్‌బీఎస్ వరకు ఉన్న స్ట్రెచ్ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. నేతాజీ బ్రిడ్జి, అమెరికన్ ఆసుపత్రి వంతెన, సత్యంగారి హోటల్ వద్ద కటింగ్‌లో వాహనదారులు, పాదచారులు ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న భౌగోళిక, ఇంజనీరింగ్ సమస్యలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నేతాజీ బ్రిడ్జి నుంచి పీఎన్‌బీఎస్ వరకు ఉన్న స్ట్రెచ్‌లో మూడు నెలల్లో పదిమంది వాహనదారులు, పాదచారులు ప్రాణాలు మిగతా 6లో..

విస్తరిస్తేనే ఫలితం

వారధి ఫ్లైఓవర్ కింద బౌద్ధచక్రం ఐలాండ్ వద్ద మూడు మలుపులు ఉన్నాయి. రాణిగారితోట, గీతానగర్ కట్ట, రామలింగేశ్వరనగర్ నుంచి ఎంజీ రోడ్డులోకి వెళ్లడానికి ఫ్లై ఓవర్ కింద ఒక మలుపు ఉంది. ఇక్కడ మలుపు తీసుకున్న వాహనాలు నేతాజీ బ్రిడ్జి మీదకు వెళ్తాయి. బ్రిడ్జికి సమీపాన ఉన్న మసీదు ప్రహరీతో ఇక్కడ రహదారి బాటిల్‌నెక్‌గా మారింది. ఐలాండ్ వరకు విశాలంగా ఉన్న రహదారి కాస్త ముందుకొచ్చే సరికి ఇరుకైంది. ఎంజీ రోడ్డు నుంచి కృష్ణలంకలోకి, గుంటూరువైపు మార్గంలోకి వెళ్లాల్సిన వాహనదారులు నేతాజీ బ్రిడ్జి మీద నుంచి ఎడమ వైపునకు తిరిగి సాయిబాబా గుడి ముందుగా వెళ్లి రాణిగారితోట వద్ద యూటర్న్ తీసుకోవాలి. ఇది దూరం కావడంతో వాహనదారులు బ్రిడ్జి నుంచి కుడి వైపునకు తిరిగి వ్యతిరేక మార్గంలో వెళ్తున్నారు. పీఎన్‌బీఎస్ నుంచి వచ్చే వాహనాలు వేగంగా వస్తుండటంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ బాటిల్‌నెక్ రోడ్డును విస్తరించి కుడి వైపునకు వాహనాలను రాకుండా అడ్డుకట్ట వేస్తేనే ప్రమాదాలను అరికట్టవచ్చు. అలాగే, సాయిబాబా గుడివైపు నుంచి రామలింగేశ్వరనగర్ క్రాస్‌రోడ్డు వరకు సర్వీసు రహదారిని నిర్మిస్తే నేతాజీ బ్రిడ్జి-పీఎన్‌బీఎస్ స్ట్రెచ్‌లో ప్రమాదాలు తగ్గుతాయని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

వనమెల్లా చెరిచి..

కనుమరుగవుతున్న జగ్గయ్యపేట అటవీ ప్రాంతం

» సున్నపురాయి నిక్షేపాల తవ్వకాలతో తగ్గుతున్న విస్తీర్ణం
» 6,905.42 హెక్టార్లకు గానూ 4,200 హెక్టార్లే మిగులు
» వైసీపీ హయాంలో అడ్డదిడ్డంగా కేటాయింపులు, తవ్వకాలు
» కూటమి ప్రభుత్వంలోనూ రాజకీయ నేతల కన్ను
» ఇప్పటికే అడుగంటుతున్న భూగర్భ జలాలు
» కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ దృష్టి పెట్టాలి

జగ్గయ్యపేట రిజర్వు ఫారెస్ట్ కనుమరుగవుతోంది. పర్యావరణాన్ని కాపాడే ఈ దట్టమైన అటవీ ప్రాంతం మైనింగ్ కార్యకలాపాల కారణంగా రానురానూ కుచించుకుపోతోంది. ఈ ప్రభావం జగ్గయ్యపేట ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. అటవీ విస్తీర్ణం తగ్గిపోవటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇప్పటికే తాగు, సాగునీటి కోసం తెలంగాణాపై ఆధారపడుతుండగా, భవిష్యత్తులో పరిస్థితి ఏమిటా.. అని నియోజకవర్గ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్) : జగ్గయ్యపేట రిజర్వు ఫారెస్ట్ మొత్తం 6,905.42 హెక్టార్లలో విస్తరించి ఉంది. మిగిలిన అడవుల మాదిరిగా కాకుండా సున్నపురాయి నిక్షేపాలతో కూడుకున్న అటవీ ప్రాంతమిది. దండకారణ్యంలా కనిపించదు. ఇక్కడి సున్నపురాయి నిక్షేపాలపై ఆధారపడి జగ్గయ్యపేటలో పలు సిమెంట్ ఫ్యాక్టరీలు ఏర్పడ్డాయి. ఇక్కడి రిజర్వు ఫారెస్టులో ప్రస్తుతం మైనింగ్‌కు అనుమతులు పోను 4,200 హెక్టార్ల అటవీ ప్రాంతమే మిగిలి ఉంది. ఈ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పైనా ఉంది.

వేదాద్రి వద్ద జగ్గయ్యపేట రిజర్వు ఫారెస్ట్



పరిధి ఇలా..

జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో మొత్తం 6,905.42 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామంలోని సర్వే నెంబరు 260లో 153 హెక్టార్లు, రావిరాలలో సర్వే నెంబర్ 124లో 666.24 హెక్టార్లు, బండిపాలెంలో 341, 339/2, 3/2, 4/2లలో 273 హెక్టార్లు, పోచంపల్లిలో 360లో 430.97 హెక్టార్లు, గౌరవరంలో 310లో 45.96 హెక్టార్లు, మిగతా 6లో..



ఫేషియల్ మస్తర్‌తో.. అవినీతికి చెక్!

ఇకపై ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు

» ఉపాధి పనుల్లో అవకతవకలకు చెక్ పెట్టేందుకు ఏఐ టూల్
» మరింత సమర్థవంతంగా ఎన్ఎంఎంఎస్ యాప్ రూపకల్పన
» జిల్లాలో ఆగస్టు నుంచి అమలు 6



ఫుల్‌చింతల

వరద నీటితో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. 3 లక్షల క్యూసెక్కులకు పైగా నీరు వస్తుండటంతో పులిచింతల ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టు గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. బుధవారం సాయంత్రం 6 గంటలకు 41.60 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జున సాగర్ నుంచి ప్రస్తుతం 3,01,561 క్యూసెక్కుల వరద వస్తోంది. కేవలం నాలుగు టీఎంసీలు వస్తే పులిచింతల నిండుతుంది. ముందు జాగ్రత్తగా అధికారులు 12 గేట్లను మూడు మీటర్లు పైకెత్తి ప్రకాశం బ్యారేజీకి వదులుతున్నారు. కాగా, జిల్లాలోని తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో నదిలోకి దిగొద్దని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని ప్రాజెక్టు డీఈఈ వెంకట్ తెలిపారు. - కంచికచర్ల

వేదోక్తంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం మేళ, తాళాల మధ్య వేదోక్తంగా నిర్వహించారు. అర్చకులు లోకకళ్యాణం కోసం సంకల్పం చెప్పారు. వివాహం కావాల్సిన వారికి ఆటంకాలు తొలగి త్వరగా వివాహాలు కావాలని రాహు, కేతు బాధలు తొలగాలని, కుజ దోష నివారణ నుంచి సంతాన ప్రాప్తి కోసం, వంశాభివృద్ధి కోసం సంకల్పం చెబుతూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని, వల్లీ దేవసేనలను వధూవరులుగా వేదికపై ఉంచి ఆగమోక్త, శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. దేవేరులకు మాంగల్యధారణ, తలంబ్రాలు కార్యక్రమాలను భక్తుల ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

రహదారి విస్తరణకు చర్యలు తీసుకోండి

» కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ శివనాథ్ వినతి



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ శివనాథ్

వన్‌టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పరిధిలోని జాతీయ రహదారుల విస్తరణ, సబ్‌వేలు, సర్వీసు రోడ్ల ఏర్పాటుపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో బుధవారం ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో కలిసి ఎంపీ కేశినేని చిన్ని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వినతి పత్రాన్ని అందజేశారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు లైన్లుకు విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. విజయవాడ వెస్ట్ బైపాస్ రహదారి ప్యాకేజీ 3 (పెద్ద అవుటుపల్లి-గొల్లపూడి)లో రెండు వైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని, గొల్లపూడి-జక్కంపూడి నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, కృష్ణలంక-ఎంజీరోడ్డు రాణిగారితోట వద్ద అత్యవసర సబ్‌వే నిర్మాణాలను చేపట్టాలని మంత్రికి వివరించారు. సబ్‌వేలు పూర్తి అయితే ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని, ముఖ్యంగా ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు పూర్తి సహాయ సహకారం అందిస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్టు చెప్పారు.

నరసాపూర్‌కు తిరుపతిలో హాల్ట్

రైల్వేస్టేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అరక్కోణంలో అభివృద్ధి పనుల నిమిత్తం ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు వరకు నరసాపూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (07153, 07154) రైళ్లు అదనంగా తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద నిలుస్తుందని దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరక్కోణంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ రైళ్లను రేణిగుంట, మేల్పాకం, కాట్పాడి, జోలార్‌పేటకు బదులు రేణిగుంట, పాకాల, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట మీదుగా నరసాపూర్-ఎస్ఎంవిటి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ నడుస్తాయని తెలిపారు. 07153 నెంబరు రైలు తిరుపతి స్టేషన్‌కు 3.38కు వచ్చి 3.43 గంటలకు బయలుదేరి వెళుతుంది. 07154 రైలు తిరుపతికి 13.30కి వచ్చి 13.35 గంటలకు బయలుదేరి వెళుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

కాకినాడ పోర్టు-భావ్‌నగర్ రైలు వేళల్లో మార్పు

ఆగస్టు 7 నుంచి కాకినాడ పోర్టు-భావ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12755) వివిధ స్టేషన్ల వేళల్లో మార్పులు చేసినట్టు విజయవాడ డివిజన్ రైల్వే పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 7వ తేదీ గురువారం నుంచి సూరత్ స్టేషన్‌కు 9.40కు వచ్చి 9.45 గంటలకు బయలుదేరుతుంది. మణినగర్‌కు 13.09కు వచ్చి 13.11 గంటలకు వెళుతుంది. అహ్మదాబాద్‌కు 13.15కు వచ్చి 13.25 గంటలకు బయలుదేరి వెళుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

మాయదారి మలుపులు

(5వ పేజీ తరువాయి)

కోల్పోయారు. ఒక్కనేతాజీ బ్రిడ్జి వద్దే ఈనెలలో ముగ్గురు ప్రాణాలు విడిచారు. ఎంజీ రోడ్డులో నుంచి రాణిగారితోటలోకి రాత్రి సమయంలో రోడ్డు దాటుతున్న ఓ మహిళను ఫ్లైఓవర్ నుంచి వస్తున్న లారీ ఢీకొంది. అక్కడికక్కడే చనిపోయింది. ఓ వ్యక్తి అన్న క్యాంటీన్‌లో భోజనం చేసి రాణిగారితోట వైపునకు వెళ్తుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయాడు. సత్యం గారి హోటల్ వద్ద కూడా రోడ్డు దాటుతున్న వాహనదారులను బస్సులు ఢీకొట్టాయి. జాతీయ రహదారి నగరం మధ్య నుంచి వెళ్లడం, వాహనదారులకు సరిపడా అంతర్గత మార్గాలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.

నేతాజీ బ్రిడ్జి వద్ద నరకం

కనకదుర్గమ్మ వారధి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తారస్థాయికి చేరింది. వారధికి అనుసంధానమై ఉన్న ఫ్లైఓవర్ ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఏర్పాటుచేసిన స్పీడు బ్రేకర్లతో ఆ ప్రదేశంపై ఇప్పుడు తీవ్ర చర్చ నడుస్తోంది. వారధి ఫ్లైఓవర్‌కు ముందుభాగాన జాతీయ రహదారిపై నేతాజీ బ్రిడ్జి ఉంది. ఇది జాతీయ రహదారిని, ఎంజీ రోడ్డును కలుపుతుంది. కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాల ప్రజలు ఎంజీ రోడ్డులోకి ఈ మార్గంలోనే వెళ్తారు. నేతాజీ బ్రిడ్జికి ఎదురుగా రాణిగారితోటలోకి వెళ్లడానికి, అక్కడి నుంచి జాతీయ రహదారి పైకి రావడానికి కటింగ్ ఉంది. ఈ ప్రదేశంలోనే విజయవాడ-గుంటూరు-విజయవాడ మార్గానికి మధ్యలో ఇనుప బద్దెలతో ఏర్పాటుచేసిన మూవింగ్ గేట్‌ను డివైడర్‌గా ఏర్పాటు చేశారు. ఎంజీ రోడ్డులో నుంచి వీఐపీలు మంగళగిరి వెళ్లే సమయాల్లో ఈ గేటును తెరుస్తున్నారు. ఆ సమయంలో రెండువైపులా వాహనాలను ఆపుతారు. రాణిగారితోట చుట్టుపక్కల ప్రదేశాల నుంచి ఎంజీ రోడ్డులోకి వెళ్లేవారు జాతీయ రహదారిని దాటి నేతాజీ బ్రిడ్జి మీదకు వస్తారు. అక్కడి నుంచి పశువుల ఆసుపత్రి కూడలికి చేరుకుని ఎంజీ రోడ్డులోకి ప్రవేశిస్తారు. సరిగ్గా గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఇక్కడే ఫ్లైఓవర్ దిగుతాయి. మరికొన్ని వాహనాలు ఎంజీ రోడ్డులోకి మలుపు తిరిగి నేతాజీ బ్రిడ్జి పైకి వెళ్తున్నాయి. పై నుంచి దిగే క్రమం కావడంతో వాహనాలు వేగంగా వస్తున్నాయి. వాటిని గమనించకుండా పాదచారులు రోడ్డు దాటడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. పగటిపూట అయితే.. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపుతున్నారు. రాత్రిపూట పోలీసులు ఉండకపోవడంతో పాదచారులు వాహనాలను గమనించకుండా రోడ్డు దాటేస్తున్నారు. ఫ్లైఓవర్, పీఎన్‌బీఎస్ వైపు నుంచి వచ్చే వాహనాలు వేగంగా వస్తుండటంతో స్పీడు బ్రేకర్లు ఉన్న ప్రదేశంలో ఈనెలలో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదాల నియంత్రణకు విజయవాడ-గుంటూరు-విజయవాడ మార్గంలో ఏర్పాటుచేసిన స్పీడు బ్రేకర్లు ఇప్పుడు కొత్త సమస్యను తీసుకొచ్చాయి. సరిగ్గా ఇక్కడికి వచ్చే సరికి వాహనాలు నెమ్మదిగా కదలడంతో ట్రాఫిక్ ఆగిపోతోంది.

ఎఫ్‌వోబీపై ముందుకెళ్లి వెనక్కి

నేతాజీ బ్రిడ్జి దాటాక మరో ప్రమాదకరమైన ప్రదేశం అమెరికన్ ఆసుపత్రి బ్రిడ్జి. పీఎన్‌బీఎస్‌కు వెళ్లే మార్గంలో ఈ బ్రిడ్జికి ఎదురుగా, వారధి ఐలాండ్‌కు సమీపాన రోడ్డు కటింగ్ ఉంది. కృష్ణలంకలోకి వెళ్లడానికి ఇదొక మార్గం. ఇదికాకుండా కృష్ణలంక జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్‌కు దిగువన అండర్ పాస్ నుంచి మరో మార్గం ఉంది. కృష్ణలంక నుంచి ఎంజీ రోడ్డులోకి వెళ్లే వాహనదారులు అమెరికన్ ఆసుపత్రి సమీపాన ఉన్న వంతెన వద్ద యూటర్న్ తీసుకుని వెళ్తున్నారు. ఎంజీ రోడ్డు నుంచి కృష్ణలంకలోకి వెళ్లే పాదచారులు ఇక్కడే రహదారిని దాటతారు. ఇక్కడ వంతెన పల్లంగా ఉండటం, జాతీయ రహదారి ఎత్తులో ఉండటంతో అమెరికన్ ఆసుపత్రి వైపు నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలు ఇక్కడే వేగంగా పైకి వస్తున్నాయి. పీఎన్‌బీఎస్ వైపు నుంచి వచ్చే వాహనాలు వేగంగా రావడంతో యూటర్న్ వద్ద, అమెరికన్ ఆసుపత్రి వంతెన వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుందన్న ప్రతిపాదన అధికారుల నుంచి వ్యక్తమైంది. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని భావించి వెనక్కి తగ్గారు. ఒకవేళ నిర్మించినా పాదచారులు ఉపయోగించరని భావిస్తున్నారు.

ఫేషియల్ మస్తర్‌తో.. అవినీతికి చెక్!

ఇకపై ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు

» ఉపాధి పనుల్లో అవకతవకలకు చెక్ పెట్టేందుకు ఏఐ టూల్

» మరింత సమర్థవంతంగా ఎన్ఎంఎంఎస్ యాప్ రూపకల్పన

» కనీసం 4 గంటల వ్యవధిలో రోజుకు రెండు పర్యాయాలు

» జిల్లాలో ఆగస్టు నుంచి అమలు



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు(ఫైల్)

ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) పనులపై ప్రస్తుతం జిల్లాలో సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) జరుగుతోంది. జి.కొండూరు, ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం మండలాల్లో ఆడిట్ పూర్తికాగా.. తిరువూరు మండలంలోని వావిలాల గ్రామంలో రూ.11 లక్షల అవినీతి జరిగినట్టు తేలింది. గంపలగూడెంలో ఒకే కుటుంబం నిబంధనలకు విరుద్ధంగా రెండేసి జాబ్‌కార్డులను పొంది 300 రోజుల పనికి వేతనాలు పొందినట్టు వెల్లడైంది. ఇకపై ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఫేషియల్ రికగ్నిషన్ మస్తర్ విధానాన్ని తీసుకువస్తున్నారు. సగటున నాలుగుగంటల వ్యవధిలో రోజుకు రెండుసార్లు ఫేషియల్ మస్తర్ ఇవ్వాల్సి ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

గ్రామీణులకు ఉపాధి కల్పించడం, పల్లె సీమల్లో పంటలు, పచ్చదనాన్ని పరిరక్షించే బహుళ ప్రయోజనాలతో రూపొందించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొందరు స్వార్థపరుల కారణంగా అపహాస్యం అవుతోంది. ఎంతోమంది పేదలకు ఈ పథకం ఆర్థిక తోడ్పాటును అందించడంతో పాటు ఎన్నో పల్లెలకు మరింత పచ్చదనాన్ని ఇచ్చింది. పంట కాలువలు, డ్రెయిన్ల పూడిక తీత, పంట పొలాల్లో కందకాలు తవ్వకం, నీటి వనరుల సంరక్షణ వంటి చర్యలు ఉత్పత్తులను పెంచింది. ఇదంతా నాణానికి ఒక వైపు. మరోవైపు అదే స్థాయిలో అవినీతికి ఈ పథకం ఆస్కారమిచ్చింది. పథకం నిర్వహణలో లొసుగుల ఆధారంగా కొందరు ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలోని 16 మండలాల్లో 2.50 లక్షలకు పైగా ఉన్న జాబ్ కార్డుల్లో ప్రస్తుతం 1.79 లక్షల జాబ్ కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 3.10 లక్షల మంది గ్రామీణులు ఈ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రతి రోజూ 30 వేలమంది పనికి హాజరవుతుండగా, మిగిలిన నెలల్లో రోజుకు సగటున ఎనిమిది వేలమంది మాత్రమే పనికి హాజరవుతున్నారు. ఒక్కో కూలీకి రోజుకు సగటున రూ.298 చెల్లిస్తున్నట్టు డ్వామా అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రధానంగా చెరువులు, కాల్వల పూడిక తీత, కందకాల తవ్వకం, ఉద్యాన పంటల సాగు, డ్రెయిన్‌ల పూడిక తీత, పశువుల షెడ్ల నిర్మాణం, పంటకుంటల తవ్వకం పనులు అత్యధికంగా జరుగుతున్నాయి.

ఒక్కోగ్రామంలో ఏడాదికి సగటున రూ.5 లక్షల అవినీతి!

కూలీల మస్తరు(హాజరు), పనికొలతల్లో ఈ పథకం ద్వారా అత్యధికంగా అవినీతి జరుగుతోందని సోషల్ ఆడిట్ నివేదికల ద్వారా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. పనిచేయని వ్యక్తులతో క్షేత్రస్థాయిలోని ఫీల్డ్ అసిస్టెంట్(ఎఫ్ఏ)లు కుమ్మక్కై కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. దీనికి కళ్లెం వేసేందుకు నేషనల్ మొబైల్ మానటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్)ను ఐదేళ్ల క్రితం అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటి వరకు మాన్యువల్‌గా ఉన్న మస్తర్ విధానానికి ఎన్ఎంఎంఎస్ చెక్ పెట్టింది. అయితే కేవలం పనిచేసే వారి తలల లెక్కింపు(హెడ్ కౌంట్) మాత్రమే ఇప్పటి వరకు ఈ యాప్ తీసుకునేది. ఈ వెసులుబాటును కొందరు ఎఫ్ఏలు అవినీతికి సద్వినియోగం చేసుకున్నారు. ముందస్తు వ్యూహంతో కూలీల దుస్తులు మార్చి ఫోటోలు అప్‌లోడ్ చేయడం, మరణించిన వారు పనిచేసినట్టు నమోదు చేయడం, ఒకే వ్యక్తి పలు ప్రదేశాల్లో పనిచేసినట్టు రోజుకు నాలుగైదు మస్తర్‌లు వేయడం, రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు పనికి రాకపోయినా వారి పేర్లను నమోదు చేయడం, ఒకే కుటుంబానికి రెండు నుంచి నాలుగు కార్డులు ఇచ్చి అవినీతికి పాల్పడిన ఉదంతాలు ఎన్టీఆర్ జిల్లాలో అనేకం వెలుగు చూశాయి. ఒక్కో గ్రామంలో ఏడాదికి సగటున రూ. 5 లక్షలు అవినీతి జరుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదే విషయంపై ఇటీవల కలెక్టర్ జి.లక్ష్మీశ ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధికంగా అవినీతికి పాల్పడిన ఎఫ్ఏలను గుర్తించాలని ఎంపీడీవోలకు ఆదేశించారు. మండలానికి ముగ్గురు చొప్పున అత్యధిక అవినీతికి పాల్పడిన ఎఫ్ఏలను సస్పెండ్ చేయాలన్నారు.

ఇకపై ముఖ ఆధారిత హాజరు

మస్తర్ విధానంలో అవినీతికి చెక్ పెట్టేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టూల్‌ను కేంద్రం రంగంలోకి దించింది. ఇప్పటికే ఉన్న ఎన్ఎంఎంఎస్ యాప్‌కు అత్యాధునిక సాంకేతికతను జోడించింది. గ్రామ, మండల, జిల్లాలోని భౌగోళిక పరిస్థితులను ఈ యాప్ అంచనా వేసేలా రూపొందించారు. ఇప్పటికే నమోదైన కూలీల వివరాలను జాబ్‌కార్డ్, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, కూలీ తాజా ఫోటోను యాప్‌లో నమోదు చేయాలి. కూలీ వివరాలు నమోదు కాకుంటే ఈ-కేవైసీ చేయించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరి ఫోటోను పని ప్రారంభంలో తీసి యాప్‌లో నమోదు చేయాలి. అదేవిధంగా పని పూర్తయిన తరువాత ఫోటోను అప్‌లోడ్ చేయాలి. ఉదయం 12 గంటల లోపు మొదటి ఫోటోను, సాయంత్రం నాలుగు గంటలలోపు రెండోఫోటోను(ఒక్కో ఫోటోకు కనీసం నాలుగు గంటల వ్యవధి ఉండాలి) అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అప్‌లోడ్ చేసే ఫోటో యాప్‌లో నమోదు చేసిన ఈ-కేవైసీ వివరాలతో ఖచ్చితంగా సరిపోలాలి. లేదంటే డూప్లికేట్ హాజరుగా యాప్ నిర్ధారిస్తుంది.

ఆగస్టు మొదటి వారం నుంచి మొదలు



\- అరేపల్లి రాము, ప్రాజెక్ట్ డైరెక్టర్

ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ఆగస్టు మొదటి వారంనుంచి జిల్లాలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. మస్తర్‌లో జరుగుతున్న అవకతవకలకు ఎన్ఎంఎంఎస్ యాప్‌లోని ఏఐ టూల్ ఖచ్చితంగా చెక్ పెడుతుంది. డూప్లికేట్ హాజరు, ఒకేరోజు రెండు అంతకు మించిన ప్రదేశాల్లో పనిచేస్తున్నట్టు చూపించే విధానాన్ని, చనిపోయిన వారి పేరుతో పనిచేసే విధానాన్ని పట్టిస్తుంది. యాప్‌లో అప్‌లోడ్ అవుతున్న కూలీల వివరాలను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు సాంకేతిక నిపుణులను ప్రభుత్వం నియమించింది. రానున్న రోజుల్లో ఈ పథకం మరింత పక్కాగా.. పకడ్బందీగా జరిగే అవకాశం ఉంది.

7 పట్టణాల్లో స్మార్ట్ వీధులు

» స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లకు అనుమతి

» మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 7 పట్టణాల్లో స్మార్ట్ వీధుల ఏర్పాటుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ అనుమతించింది. ఇప్పటికే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా 200 షాపులతో స్మార్ట్ వీధిని ఏర్పాటు చేశారు. తాజాగా అనంతపురం, కర్నూలు, తాడేపల్లి-మంగళగిరి, ఒంగోలు, శ్రీకాకుళం, విజయవాడ, కడప మున్సిపల్ కార్పొరేషన్లలో 'స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌'ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో కార్పొరేషన్‌లో 40 నుంచి 200 వరకు షాపులతో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తారు. జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ మార్గదర్శకాల ప్రకారం వీటిని నిర్వహిస్తారు. 18 ఏళ్లు నిండిన వీధి వ్యాపారులకు ఈ షాపుల ఏర్పాటులో ప్రాధాన్యమిస్తారు. స్ట్రీట్ వెండర్ కార్డులున్న వారికి అవకాశమిస్తారు. కంటైనర్ మోడల్‌లో ఈ షాపులను నిర్మిస్తారు. వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తారు. బ్యాంకులు, పీఎం స్వానిధి ద్వారా రుణాలు అందిస్తారు. డిజిటల్ లావాదేవీలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో కార్పొరేషన్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.1.80 కోట్ల నుంచి రూ.9 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. అనంతపురం, కర్నూలు, ఒంగోలు, శ్రీకాకుళం, కడపల్లో 100 చొప్పున, తాడేపల్లి, విజయవాడల్లో 40 చొప్పున మొత్తం 580 షాపులు నిర్మిస్తారు. ఇందుకోసం మొత్తం రూ.26.10 కోట్లు ఖర్చు చేయనుండగా అందులో పట్టణ స్థానికసంస్థలు రూ.16.82 కోట్లు, స్వయం సహాయ రుణాలు రూ.8.70 కోట్లు, మెప్మా ద్వారా రూ.58 లక్షలు ఖర్చు చేస్తారు.

పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ పదవికి రాయపాటి శైలజ రాజీనామా ఆమోదం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ.. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ పదవికి చేసిన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమెను గత ఏడాది సెప్టెంబరులో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించింది. ఆ తర్వాత ఆమెను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమించింది. దీంతో ఆమె సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టరు పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ ఈ ఏడాది మే 13న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీకి లేఖ రాశారు. ఆమె రాజీనామాను ఆమోదిస్తూ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎండీ, పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ సౌరభ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్‌గా కృష్ణచైతన్య

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తూనికలు, కొలతల (లీగల్ మెట్రాలజీ) శాఖ జాయింట్ కంట్రోలర్‌గా ఎ.కృష్ణ చైతన్యను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు లీగల్ మెట్రాలజీ కంట్రోలర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం

(5వ పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఈవో శీనానాయక్‌తో కలిసి దుర్గగుడిలో జరుగుతున్న దసరా ఏర్పాట్లతో పాటు మాస్టర్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా చేస్తున్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ, భవన నిర్మాణాలను పరిశీలించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఘాట్ రోడ్డుపై రాకపోకలు, పార్కింగ్ ఏర్పాటును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యుడు, ఇంజనీరింగ్ అధికారులు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు తదితరులు ఉన్నారు.

కూల్చటం.. కట్టడం మీ ఇష్టమేనా?

దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులపై దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మించటం, కూల్చటం అంతా మీ ఇష్టం అయిపోయింది.. మీరు మారరా.. అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన పెర్గోలా, కూల్చివేసిన శివాలయం మెట్ల పక్కన వాల్ గురించి వెంటనే నివేదిక పంపించాలంటూ కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొండపైన పూజామండపంలో గోడలకు గ్రానైట్ ఏర్పాటు చేయటంపై ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెర్గోలాను తొలగించేటప్పుడు కమిషనర్ అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నించారు. లడ్డూ ప్రసాదం భవన నిర్మాణం అనుమతి మూడు ఫ్లోర్‌లకే ఉండగా నాలుగవ ఫ్లోర్ ఎందుకు వేశారు.. మళ్లీ ఐదో ఫ్లోర్ ఎందుకు వేస్తున్నారంటూ అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం మహామండపంలో ఉన్న పరిపాలనా విభాగాన్ని లడ్డూ ప్రసాదం భవనంలోని నాలుగవ అంతస్తుకు ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్‌కు ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు రోడ్డు వేయకపోవటం సిగ్గుగా ఉంది. భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భక్తుల భద్రత నిమిత్తం కొత్త రోడ్డు నిర్మించటానికి సుమారు ఐదారు నెలల క్రితం నేనే టెంకాయ కొట్టి పూజా కార్యక్రమాలు చేశాను. ఇంతవరకు రోడ్డు నిర్మాణం చేపట్టలేదు అన్నారు.

దుర్గమ్మ లడ్డూ ప్రసాదంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : ఈవో

అమ్మవారి లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఈవో వి.కె.శీనానాయక్ సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ముడి సరుకులు సేకరణ ప్రామాణిక వంటకాలను పాటించటం, ప్రసాదం పోటులో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలలోకి లడ్డూ ప్రసాదం తయారీని మార్చనున్నట్టు ఆయన తెలిపారు.

వనమెల్లా చెరిచి..

(5వ పేజీ తరువాయి)

గండ్రాయిలో 220,221 223/1లో 204 హెక్టార్లు, తక్కెళ్లపాడులో 98లో 58.53 హెక్టార్లు, రామచంద్రునిపేట గ్రామంలో 94లో 27.89 హెక్టార్లు, జగ్గయ్యపేటలోని 236లో 1770.42 హెక్టార్లు, త్రిపురవరంలో సర్వే నెంబరు ఒకటిలో 98.53 హెక్టార్లు, బూదవాడ 328/5, 361, 344, 61, 376, 362లో 823 హెక్టార్ల మేర ఫారెస్ట్ విస్తరించి ఉంది.

మైనింగ్ కార్యకలాపాల కోసం కేటాయింపులు ఇలా..

జగ్గయ్యపేట రిజర్వు ఫారెస్ట్‌లో మైనింగ్ కార్యకలాపాల కోసం మొత్తం 1,900 హెక్టార్లను కేటాయించారు. రామ్‌కో సిమెంట్స్‌కు 220.72 హెక్టార్లు, అల్ట్రాటెక్ కర్మాగారానికి 622.229 హెక్టార్లు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు 900 హెక్టార్లు, కాకతీయ సిమెంట్స్‌కు 120.46 హెక్టార్ల భూములు ఇచ్చారు. వన సంరక్షణ సమితికి మరో 2,500 హెక్టార్లు కేటాయించారు.

రాజకీయ గద్దల కన్ను

రిజర్వు ఫారెస్ట్‌లో కేటాయింపులు పోను ఇంకా 4,200 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. సున్నపు రాయి నిక్షేపాలు ఉండటంతో వీటిపై రాజకీయ గద్దల కన్ను పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కడప, కర్నూలు ప్రాంతాలకు చెందిన నేతలు 4,200 హెక్టార్లలో మైనింగ్‌కు దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. కూటమి అధికారంలోకి రావటంతో కేటాయింపులు ఆగాయని సమాచారం. కేటాయింపులు అమల్లోకి వస్తే దాదాపు రిజర్వు ఫారెస్ట్ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలోనూ అధికార పార్టీ నాయకులు కొందరి కన్ను ఈ సున్నపురాయి నిక్షేపాలపై పడింది. మిగులు అటవీ ప్రాంతాన్ని కనుక మైనింగ్‌కు అప్పగిస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతిన టంతో పాటు జగ్గయ్యపేట కరువు ప్రాంతంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. సాగు, తాగునీటి కోసం తెలంగాణాపై ఆదారపడాల్సిన వస్తుంది.

గాడితప్పిన వన సంరక్షణ

వన సంరక్షణ కింద రెండు దశాబ్దాల కిందట 2,500 హెక్టార్లు కేటాయించినా ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. వనాలు పర్యవేక్షణలోపంతో కుమరుగయ్యాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వట్లేదు. ప్రకృతి సంపదను ప్రైవేట్ సంస్థలకు దోచిపెట్టే కార్యక్రమానికి ముగింపు పలికి.. మిగిలిన అటవీ ప్రాంతాన్నైనా సంరక్షించగలిగితే భావితరాలకు మంచిచేసిన వారవుతారు.

జీవన చిత్రం

రెక్కాడితేగాని డొక్కాడని జీవనం వారిది.. బతుకు నావ సవ్యంగా సాగాలంటే పడవలు పదిలంగా ఉండాలి. ఎగువ నుంచి కృష్ణా నదికి భారీగా వస్తున్న వరద వల్ల చేపల వేటకు విరామం రావడంతో.. ఒడ్డుకు చేరిన పడవలకు తుమ్మలపాలెం ఘాట్ వద్ద మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు (ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)





నిరసన చేపట్టిన పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికురాలిపై ట్రాక్టర్ మెకానిక్ దాడి

» చర్యలు తీసుకోవాలని కార్మికుల ఆందోళన

మైలవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ కఠారి ఉమామహేశ్వరరావు పారిశుధ్య కార్మికురాలిపై చేయి చేసుకున్నాడంటూ పంచాయతీ కార్యాలయం కూడలిలో కార్మికులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. బిజిలి భవాని(42) గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. ఆమె విధుల్లో భాగంగా బుధవారం రామకృష్ణ కాలనీలో చెత్త తరలించేందుకు వెళ్లగా ఓ గృహిణి ఎందుకు ఆలస్యంగా వచ్చావని భవానిని అడగటంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. అంతలో మెకానిక్ ఉమామహేశ్వరరావు అక్కడకు చేరుకొని తనపై దుర్భాషలాడి చేయిచేసుకున్నాడని భవాని ఆరోపించింది. తోటి కార్మికులకు సమాచారం ఇవ్వడంతో విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. వీరికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయాలని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అరెస్టు చేస్తేగానీ ఆందోళన విరమించేదిలేదని వారు పట్టుబట్టారు. గంటల తరపడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో సీఐ దాడి చంద్రశేఖర్ సిబ్బందిచే బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి, సీపీఎం నేతలను స్టేషన్‌కు తరలించారు. మెకానిక్ ఉమామహేశ్వరరావు గతంలో వైసీపీలో కొనసాగారు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు టీడీపీలో చేరారు. విచారణ చేపట్టి దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ఆపదేం లేదు..

(5వ పేజీ తరువాయి)

సముద్రంలోకి విడుదల చేసినట్లు చెప్పారు. గురువారం ఉదయానికి లక్ష క్యూసెక్కులు, మరో రెండు రోజుల్లో రెండు లక్షల క్యూసెక్కుల నీరు నది ఎగువ నుంచి చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులను సమన్వయం చేసి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఒక గ్రామానికి మాత్రమే మార్గం తెగిపోయే అవకాశం ఉందన్నారు. అయితే, ఆ గ్రామానికి ఎలాంటి ముప్పు ఉండదన్నారు. 43 లోతట్టు ప్రాంతాలను గుర్తించామని, ప్రమాదం తలెత్తితే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు మ్యాపింగ్ చేసుకుని సిద్ధంగా ఉన్నామన్నారు. నగరంలో డ్రెయినేజీలు పొంగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. బుడమేరు, పులివాడు, కోతుల వాగు పరివాహక ప్రాంతాల్లోనూ ప్రజలను, అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రాంతాల్లో నదిలో చేపల వేటకు వెళ్లొద్దని, లంక గ్రామాల్లోని ప్రజలు పశువులను నదిలోకి వదలొద్దని సూచించారు. వరద నేపథ్యంలో కలెక్టరేట్‌లో 9154971454 నెంబర్‌తో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు.

అటవీశాఖలో 15 మందికి పదోన్నతి

అమరావతి : అటవీశాఖలో 15 మంది అసిస్టెంట్ కన్జర్వేటర్లకు రాష్ట్ర కేడర్‌లో డిప్యూటీ కన్జర్వేటర్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. 2024-25ప్యానల్‌లో ఉన్న అసిస్టెంట్ కన్జర్వేటర్లకు శాఖాపరంగా పదోన్నతులు ఇచ్చింది. అయితే ఈ పదోన్నతులు పూర్తిగా తాత్కాలికమని, కోర్టు ఉత్తర్వులకు లోబడి ఉంటాయని, ఏ సమయంలోనైనా దిగువ పదవికి తిరిగి మార్చవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఇంద్రకీలాద్రి: దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం లబ్బీపేటకు చెందిన వేములపల్లి శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.1,01,116లు విరాళంగా దేవస్థానం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనం కల్పించారు. వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందచేశారు. ఏఈవో రమేష్ బాబు, అర్చకులు దాత కుటుంబానికి అమ్మవారి చిత్రపటం, విరాళం రశీదు, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



రైల్వే స్టేషన్ బయట ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు, వివిధ విభాగాల అధికారులు



మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ సరిత, తదితరులు

బాలల అక్రమ రవాణా పెద్ద నేరం

విజయవాడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ శైలజ

రైల్వేస్టేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బాలల అక్రమ రవాణా పెద్ద నేరమని విజయవాడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ ఎం. శైలజ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో విజయవాడ రైల్వే స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.శైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలల అక్రమ రవాణాను నిరోధించాలన్నారు. బాలల అక్రమ రవాణా సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లు 1800-1027-222, 0866-2470966లకు తెలియపరచాలని ఆమె తెలిపారు. వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ పిల్లలను అక్రమ రవాణాకు గురికాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాసవ్య మహిళా మండలి బాల కార్మికులను, పిల్లల అక్రమ రవాణా, బాల్య వివాహాల నుంచి సుమారు 237 మందిని కాపాడినట్లు ఆమె వివరించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ ఫతే ఆలీబేగ్, ఎస్ఐ ఎస్.ఎస్.రావు, వీఎంఎం పీడీ రామానుజయ్య, ఐసీడీఎస్ కౌన్సిలర్ జి.జీవన్, వాసవ్య మహిళా మండలి సభ్యులు జె.హృదయరాజు, ప్రసాద్, సౌజన్య, రేవతి, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన బాధ్యత అందరిదీ
డీసీపీ సరిత

విజయవాడ సిటీ: మానవ అక్రమ రవాణా నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అడ్మిన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.జి.వి.సరిత సూచించారు.

బాలలు, మహిళల అక్రమ రవాణాలకు వ్యతిరేకంగా కలిసి పోరాడదామని ఆమె పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణా నిర్మూలన దిశగా ప్రజలను చైతన్య పర్చేందుకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన పోస్టర్‌ను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీ బుధవారం ఆవిష్కరించారు. మానవ అక్రమ రవాణాపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వాసవి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ విజయవాడ కో ఆర్డినేటర్ అరవ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ వెంబడి రెయిలింగ్, గ్రీనరీ ఏర్పాటు

లయోల కళాశాల రోడ్లో చురుగ్గా సాగుతున్న పనులు



లయోల కళాశాల రోడ్లో డ్రెయిన్ వెంబడి రెయిలింగ్, గ్రీనరీ ఏర్పాటు

గుణదల, ఆంధ్రజ్యోతి: లయోల కళాశాల రోడ్లో డ్రెయిన్ వెంబడి రెయిలింగ్ అలాగే గ్రీనరీ ఏర్పాటు చేసే పనులను నగరపాలక సంస్థ అధికారులు చేపట్టారు. బెంజిసర్కిల్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల మీదుగా ఎగ్జిక్యూటివ్ క్లబ్, లయోల కళాశాల వైపు వర్షపునీరు, మురుగునీరు గుణదల పుల్లేటికట్ట రోడ్డుగుండా రైవస్ కాల్వలో కలుస్తుంది. ఈ డ్రెయిన్ వెంబడి రెయిలింగ్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు కార్లు డ్రెయిన్లో పడిన ఘటనలు లేకపోలేదు. లయోల కళాశాల రోడ్లో వాహనాల రాకపోకలు రద్దీగా ఉండటంతో రాత్రివేళల్లో చాలా మంది డ్రెయిన్లో పడిన సందర్భాలు ఉన్నాయి. ప్రమాదాలను అరికట్టడంతోపాటుగా గ్రీనరీ పెంచాలన్న ఆలోచనతో సైడు కాల్వ వెంబడి రెయిలింగ్ , దాని పక్కనే మొక్కలు నాటే పనులకు నగరపాలకసంస్థ అధికారులు శ్రీకారం చుట్టారు. పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెయిలింగ్ ఏర్పాటు, గ్రీనరీ పెంపుదలతో ప్రమాదాలు జరగకుండా చెక్ పెట్టినట్లయిందని స్థానికులు, వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి

● సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్, పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ అనిల్ తదితరులు

ప్రభుత్వాసుపత్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కఠినమైన శ్రమ, నిబద్ధత, నిజాయితీతో చదువుపట్ల మనసుపెట్టి రాణించాలని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ఏడుకొండలరావు సూచించారు. కాలేజీలోని 38వ ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్(ఐఏపీ), యూజీ క్విజ్‌పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీడియాట్రిక్స్ విభాగం సంయుక్తంగా మెడికల్ విద్యార్థుల్లో క్లినికల్ పరిజ్ఞానం, ఆసక్తిని పెంపొందించేందుకు అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి క్విజ్‌పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన డాక్టర్ జయంత్, డాక్టర్ రాజినీస్ చంద్రను అభినందించి, బహుమతులు ప్రదానం చేశారు. రాబోయే డివిజనల్ స్థాయి పోటీల్లో తమ సంస్థ ప్రాతినిధ్యం వహించనుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ అనిల్, విభాగానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

జవహర్‌కు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సేవాసంఘం సత్కారం



ప్రభుత్వాసుపత్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో దంత విభాగంలో ఇటీవల నూతనంగా ఏర్పాటైన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దుశ్శాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.కన్నయ్య, వైస్ ప్రెసిడెంట్ సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శరత్, అశోక్ కుమార్, చెన్నకేశవలు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో

నేటితో ముగియనున్న కుంభాభిషేక మహోత్సవాలు

లబ్బీపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పున్నమ్మతోట లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు గురువారంతో ముగియనున్నాయని ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున బుధవారం తెలిపారు. 5,000 మందికి అన్నప్రసాద వితరణతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి అష్టబంధన మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం సాయంత్రం విశేష మహాశాంతి, తిరుమంజనం, ధాన్యాధివాసం, సర్వదైవత్య హోమాలు జరిగినట్లు తెలిపారు. 31న మహాపూర్ణాహుతి, ఆలయప్రవేశం, కుంభాత్ బింబ సహారోహణం, కళావాహనం, ప్రథమ కళార్చనం, మహా సంప్రోక్షణ, అక్షతాంరోహణ కార్యక్రమాలు జరుగుతాయని, బ్రహ్మఘోషతో కార్యక్రమం ముగియనున్నట్లు తెలిపారు.

యువతకు భవిత చంద్రబాబుతోనే

● గద్దె క్రాంతి కుమార్

పటమట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు మంచి భవిష్యత్ అందించేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. బుధవారం పలు డివిజన్లకు చెందిన వారికి రూ.53 వేల ఆర్థిక సాయాన్ని ఆయన తన సొంత నిధుల నుంచి బాధిత కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో జాస్తి సాంబశివరావు, నందిపాటి దేవానంద్, దేవరపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ తప్పులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

● ఎమ్మెల్యే గద్దె



కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే గద్దె

మొగల్రాజపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన పాపాలను కడుగుతూ కూటమి ప్రభుత్వం మరు పక్క సంక్షేమం అభివృద్ధి చేస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 7వ డివిజన్ రావిచెట్టు సెంటర్, దాసరి లింగయ్య వీధి బూత్ నెంబరు 140 పరిధిలోని ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం జరిగింది. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల వివరాలు ఉన్న కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ చేసిన తప్పులు, పాపాల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయిందన్నారు. తొలి అడుగు కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను యాప్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్‌చంద్ర, మాదల పూర్ణచంద్రరావు సొంగా సంజయ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ అకాడమీ సేవలు అభినందనీయం

● జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు



జ్యోతి వెలిగిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు, అకాడమీ చైర్మన్ మలినేని రాజయ్య

మొగల్రాజపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థను నడుపుతూ విద్యార్థులను అన్ని రంగాలలో ఉన్నతులుగా తీర్చిదిద్దుతూ, నాణ్యమైన విద్యను అందిస్తున్న సిద్ధార్థ అకాడమీ సేవలు అభినందనీయం అని జిల్లా విద్యాశాఖా అధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్న వెంచురా 2025 కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం కవితాపఠనం, ఆంగ్ల తెలుగు సృజనాత్మక రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ మలినేని రాజయ్య, ఉపాధ్యక్షుడు వి. నాగభూషణ్‌రావు, జాయింట్ సెక్రటరీ స్కూల్ కన్వీనర్ ఎస్. విష్ణు, పాలక వర్గ సభ్యులు, ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, ఎన్టీయార్ కృష్ణా, గుంటూరు జిల్లాలో ఉన్న సీబీఎస్ఈ పాఠశాలల విద్యార్థులు 200 మంది పాల్గొన్నారు.



మట్టి మనిషి నాటికకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

ఎంబీవీకేలో మట్టి మనిషి నాటిక ప్రదర్శన 2, 3 తేదీల్లో

గవర్నర్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట సుప్రసిద్ధ రచయిత వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో తలమానికంగా నిలిచిన మట్టిమనిషి నవలను నాటిక రూపంలో మలిచారని, ఆగస్టు 2, 3 తేదీల్లో విజయవాడలోని ఎంబీవీకేలో దీని ప్రదర్శిస్తున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్ తెలిపారు. ప్రదర్శనకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శన సాయంత్రం 5.30 నుంచి 3 గంటల పాటు సాగుతుందని, ఇది ఎంతో వ్యయప్రయాసలకు కూడుకున్నది కావడంతో ప్రవేశ రుసుము రూ. 100, ప్రత్యేక రుసుము రూ. 500గా నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు చంద్రా నాయక్, గోళ్ల నారాయణరావు, మోతుకూరి అరుణ్‌కుమార్, గుండు నారాయణ, బి. జయప్రకాష్, బొర్రా నరేష్, యువీ స్వామి, బి. పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



11వ డివిజన్ బొలిశెట్టివారి వీధిలో ...



14వ డివిజన్ అంబేడ్కర్‌నగర్ దేవస్థానం భూముల్లో ..

ఖాళీ స్థలాలతో తిప్పలు

● యజమానుల నిర్లక్ష్యం, ● పిచ్చిమొక్కలు, పెరిగిన చెట్లు, ● విషకీటకాలు, దోమలు, పాములకు ఆవాసాలు ● పర్యవేక్షణ లోపం

పటమట, ఆంధ్రజ్యోతి:

తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో నివాసాల మధ్యన ఖాళీ ప్రదేశాల్లో యజమానుల నిర్లక్ష్యం వల్ల పిచ్చిమొక్కలు, చెట్లు ఏపుగా పెరిగా చిన్న పాటి అడవిని తలపిస్తున్నాయి. వర్షాకాలం కావడం వల్ల విష కీటకాలకు, పాములకు, దోమలకు ఆఖాళీ ప్రదేశాలు ఆవాసాలుగా మారాయి.

11వ డివిజన్ బొలిశెట్టివారివీధిలో పలు ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. 14వ డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో దేవదాయాశాఖకు చెందిన ఆరెకరాల ఖాళీ ప్రదేశం ఉంది. గత సంక్రాంతి సందర్భంగా దాన్ని శుభ్రం చేశారు. మళ్లీ ఇప్పుడు ఆప్రాంతం అంతా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.

12వ డివిజన్ పండరీపురం 8వ రోడ్డు మెగా ఎస్టేట్ దగ్గర ప్రాంతంలో చాలా కాలం నుంచి సరైన సంరక్షణ లేకపోవడంతో పెద్ద పెద్ద చెట్లు ఏపుగా పెరిగా అడవిని తలపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఆ స్థల యజమానులతో మాట్లాడి అక్కడి పరిసరాలను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.



12వ డివిజన్ పండరీపురం 8వ రోడ్డులో ..



రోడ్డుపై పార్క్ చేసిన బైక్‌లు

ఇరుకుగా రోడ్డు ..రాకపోకలకు ఇబ్బంది

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: రహదారులు ఆక్రమణల పాలవుతున్నాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని గులాబిరోడ్డులో పార్కింగ్ సమస్య వెంటాడుతోంది. ఆ రోడ్డులో ఇంటి యజమానులు తమ బైక్‌లు, కార్లు, ఆటోలు ఇంటి ముందు పార్కింగ్ చేస్తున్నారు.

దీంతో ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ఆ రోడ్డు ఇరుకుగా మారి ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని విధంగా ఉంది. భవనాలు నిర్మిస్తున్నారు. కానీ పార్కింగ్‌కు స్థలం వదలడం లేదు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణాల సమయంలోనే పార్కింగ్ విషయమై దృష్టి సారిస్తే ఫలితం ఉంటుందన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

థియేటర్లకు కష్టకాలం

విజయవాడలో మూతబడుతున్న సినిమా హాళ్లు

- భారంగా మారిన నిర్వహణ ఖర్చులు
- పెద్ద హీరోలు సినిమాలు తగ్గించుకోవడం ఓ కారణం
- మల్టీప్లెక్స్‌లు, ఓటీటీలపై ప్రేక్షకులకు పెరిగిన మోజు




సినిమా ప్రదర్శనలు నిలిపేసిన అప్సర, నీరజ్ శాంతి-ప్రశాంతి థియేటర్లు

గవర్నర్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో పేరున్న సినిమా థియేటర్లు వరుసగా మూతపడు తున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో పెద్ద హీరోలుగా పిలవబడుతున్న చిరంజీవి, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, మహేష్ బాబు, ఎన్టీఆర్, ప్రభాస్, రామ్‌చరణ్, అల్లు అర్జున్ సినిమాలు తగ్గించుకుని ఏడాదికి ఒకటి రెండు మాత్రమే చేయడంతో ప్రదర్శనకు సినిమాలు కరువై, నిర్వాహణ ఖర్చులు బాగా పెరిగి ఎగ్జిబిటర్లు తమ థియేటర్లను మూసివేస్తున్నారు. చిన్న సినిమా నిర్మాతలు తమ సినిమా ప్రదర్శనకు థియేటర్లు అద్దెకు తీసుకున్నా రాబడి లేకపోవడంతో ఒకటి రెండు రోజులకే ప్రదర్శన నిలిపివేస్తున్నారు. దీంతో ఎగ్జిబిటర్లు నానా అవస్థలు పడుతున్నారు. నగరంలో పేరున్న అప్సర, అన్నపూర్ణ, శకుంతల, శాంతి, ప్రశాంతి, జైహింద్, కల్యాణ్ చక్రవర్తి, కపర్ధి, రామా టాకీస్, మోహన్‌దాస్, దుర్గామహల్, జ్యోతిమహల్, రాజకుమార్, వంటి థియేటర్లు మూతపడ్డాయి. వన్‌టౌన్‌లో సగానికి పైగా థియేటర్లు మూతబడ్డాయి. వీటికి తోడు నగరంలో పేరున్న మరికొన్ని థియేటర్లు మూతపడే దశకు చేరుకున్నాయి. ప్రస్తుతానికి ప్రదర్శనలు కొనసాగుతున్నా, కొన్ని సందర్భాల్లో ప్రేక్షకులు రాకపోవడంతో షోలు క్యాన్సిల్ చేస్తున్నారు. ఈ ఏడాది 6 నెలల్లోనే నగరం నడిబొడ్డున గవర్నర్‌పేట, గాంధీనగర్ ప్రాంతాల్లోని అప్సర, అన్నపూర్ణ, శకుంతల, శాంతి, ప్రశాంతి థియేటర్ల యాజమానులు ప్రదర్శనలు నిలిపివేశారు. సినిమా హాళ్లను నేలమట్టం చేసి కాంప్లెక్సుల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్వహణ ఖర్చులు పెరగటం, ప్రభుత్వ పన్నులు విధానం లోపభూయిష్టంగా ఉండటం సంక్షోభాలకు కారణాలుగా ఉన్నా, ప్రేక్షకులు ఓటీటీ వైపు మొగ్గుచూపడం, మల్టీప్లెక్స్‌లు పెరగటం కూడా సింగిల్ థియేటర్లు మూతపడటానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. పెద్ద హీరోలు తమ చిత్రాలు తగ్గించుకోవడం, ఒకవేళ విడుదలైన బాక్సాఫీసు వద్ద బోల్తా పడటం థియేటర్లకు సినిమాలు లేకుండా పోతున్నాయి. పెద్ద హీరోల సినిమాలు వారానికే ప్రేక్షకుల ఆదరణకు దూరం కావడంతో వాటిని తొలగించి మరో సినిమా ఆడించుకోవడానికి సినిమాలు లేక థియేటర్ల నిర్వహణ భారంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి పాత సినిమాలు చూసే పరిస్థితి లేదని, ఏడాది పొడవునా కొత్త సినిమాలు ప్రదర్శించడానికి సినిమాలు విడుదల కావడం లేదని చెబుతున్నారు. తెలుగులోకి డబ్బింగ్ అవుతున్న పరభాషా సినిమాల టాక్స్ రేట్లు విపరీతంగా ఉండటంతో వాటిని ఒకటి రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు ఆడించే పరిస్థితి లేదని, డైరెక్ట్ సినిమాలు విడుదల కావడం లేదని, దీంతో థియేటర్లలో ప్రదర్శనలు లేకుండా పోతున్నాయని నిర్వాహకులు వాపోతున్నారు. అందుకే థియేటర్లు మూసివేసి వాటి స్థానంలో షాపింగ్ కాంప్లెక్సులు వేయడానికి సిద్ధమౌతున్నట్టు థియేటర్ యజమానులు చెబుతున్నారు.



వడ్డే సుందర్‌ను సత్కరిస్తున్న రవాణా శాఖ ఉద్యోగులు

రవాణాశాఖ ప్రతిష్టను పెంచుదాం

- ఆర్‌జేటీసీ డాక్టర్ వడ్డే సుందర్

కృష్ణలంక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వాహన యజమానులు చోదకులకు పారదర్శకమైన సేవలందించి రవాణాశాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేసేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు పదోన్నతులపై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటానని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వడ్డే సుందర్ తెలిపారు. కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం తొలిసారి విజయవాడ జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రవాణాశాఖ ద్వారా వాహన యజమానులు, డ్రైవర్లకు ప్రభుత్వపరంగా అందించే సేవల్లో పారదర్శకత పాటించి ప్రతిష్టను పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వాహన సారథి పోర్టల్ నిర్వహణ మరింత సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకొంటానన్నారు. రవాణా శాఖలో జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా, కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ పదోన్నతులపై త్వరలో నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జేటీసీ సుందర్‌కు ఆర్‌టీవోలు ఆర్ ప్రవీణ్, కే వెంకటేశ్వరరావు, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం రాజుబాబు, కార్యదర్శి కేవీవీ నాగమురళి, కార్యాలయ పరిపాలన అధికారులు సత్యనారాయణ, అబ్దుల్ సత్తార్, చంద్రకళ, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు.

‘రెవెన్యూ బరితెగింపు’పై జేసీ సీరియస్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

- ఆర్‌డీవో బాలకృష్ణకు విచారణ బాధ్యతలు
- పారామౌంట్‌లో తహసీల్దార్ శాంతి లక్ష్మి విచారణ
- ల్యాండ్ కన్వర్షన్‌కు ఆర్‌డీవో బాలకృష్ణ అంగీకారం
- హైదరాబాద్‌కు కంపెనీల తరలిపును ఉపసంహరించుకుంటున్నా
- మీడియాకు పారామౌంట్ అధినేత ప్రకటన విడుదల

ఆంధ్రజ్యోతి, విజయవాడ: పారామౌంట్ పరిశ్రమ విస్తరణకు ల్యాండ్ కన్వర్షన్‌కు రెవెన్యూ అధికారులు లంచం డిమాండ్ చేసిన వైనంపై ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'రెవెన్యూ బరితెగింపు'పై ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. జాయింట్ కలెక్టర్ ఇలక్కియా దీనిపై సీరియస్ అయ్యారు. నందిగామ ఆర్‌డీవో బాలకృష్ణ పెనుగంచిప్రోలు మండల తహసీల్దార్ ఏ శాంతిలక్ష్మిని పారామౌంట్ స్టీల్ కర్మాగారానికి తీసుకువెళ్లి తాజా ఉదంతంపై విచారణ చేపట్టారు. లంచం ఎవరు డిమాండ్ చేశారు? ఎంత డిమాండ్ చేశారు? ఎవరిని కలిశారు? ఎప్పుడు కలిశారు? వంటి ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానం రాబట్టినట్టు తెలిసింది. విచారణ విషయాలను అధికారులు రహస్యంగా ఉంచారు. ఇదిలా ఉండగా తమ కంపెనీ విస్తరణ పనులకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగిని ఒకరు ప్రవర్తించిన తీరుపై బాధాతప్త హృదయంతో ఖండించాల్సి వచ్చిందని కంపెనీలను హైదరాబాద్‌కు తరలిస్తానని తాను చేసిన ప్రకటనను విరమించుకుంటున్నానని పారామౌంట్ అధినేత వెనిగళ్ల సురేష్ కుమార్ ఒక ప్రకటనలో స్పందించారు. కంపెనీలు యథావిధిగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోనే కొనసాగుతాయని, తన ప్రకటనపై ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఆర్‌డీవో బాలకృష్ణ స్పందించి పరిశ్రమలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని చెబుతూ విస్తరణ పనులను త్వరగా చేపట్టేందుకు తగిన కార్యాచరణ ఇస్తూ సహకరించారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి సహకరిస్తే రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని, యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తానన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది..!

- ప్రభుత్వాసుపత్రుల్లో ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌వోల కొరతతో మిగతా సిబ్బందిపై ఒత్తిడి
- సగం కూడా లేని సిబ్బంది
- సెలవులు లేక ఇబ్బంది పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు



విజయవాడ, ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిబ్బంది కొరత తీవ్ర సమస్యగా మారింది. మూడేళ్లుగా ఎఫ్‌ఎన్‌వో, ఎంఎన్‌ఓ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పనిభారమంతా ఉన్న సిబ్బందిపై పడింది. పాత, కొత్త జీజీహెచ్‌లలో కలిపి 280 మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం 130 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో 28 మంది మాత్రమే శాశ్వత సిబ్బంది. కొత్త జీజీహెచ్‌లో సిద్ధార్థ మెడికల్ కాలేజీకి సంబంధించి 29 మంది పురుషులు, 28 మంది మహిళలు విధులు నిర్వహిస్తున్నారు. ఏపీ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా 34 మంది పనిచేస్తున్నారు. పాత జీజీహెచ్‌కు కేవలం 29 మందిని మాత్రమే కేటాయించారు, ఇక్కడ ప్రసూతి, శిశు వైద్య సేవలు అందిస్తారు. సిబ్బంది కొరతతో శుభ్రత నిర్వహణ కష్టంగా మారింది. దీంతో ఆసుపత్రి పరిసరాల్లో దుర్వాసన వస్తోంది. రోగులు, వారి సహాయకులు ముక్కున గుడ్డలు కప్పుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొత్త జీజీహెచ్‌లో రోజూ వేలాది మంది రోగులు వస్తుండగా, కేవలం 100 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. రోగులను తీసుకెళ్లడం, శుభ్రత నిర్వహణలో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కానీ స్ట్రెచర్, వీల్‌చైర్‌లను నడపడానికి సిబ్బంది లేకపోవడంతో రోగుల సహాయకులే ఈ పనులు చేయాల్సి వస్తోంది. ఒంటరి రోగులు ఆసుపత్రికి వస్తే తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు ఆసుపత్రుల్లో కలిపి 150 మంది సిబ్బందిని భర్తీ చేయాల్సి ఉంది. సగానికి పైగా ఖాళీలున్నాయి. మూడేళ్లుగా కాంట్రాక్టు లేదా శాశ్వత పద్ధతిలో ఈ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో నిర్వాహకులపై ఒత్తిడి పెరుగుతోంది. అధికారులకు పదేపదే విన్నవించినా స్పందన లేకపోవడంతో సిబ్బంది సెలవులు తీసుకోలేక, పనిభారం భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లోనూ సెలవులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో పారిశుద్ధ్య కార్మికులు ఉద్యోగాలు వదులుకోలేక, పనిభారం భరించలేక తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. అధికారులు వెంటనే స్పందించి సిబ్బందిని భర్తీ చేయాలని కార్మికులు కోరుతున్నారు.

ఖాళీ ఉండడం లేదు

లక్ష్మి, పారిశుధ్య కార్మికురాలు

తక్కువమంది సిబ్బంది ఉండడంతో ఒక్కోసారి మూడు బ్లాకుల్లో తిరగాల్సి వస్తోంది. పాత జీజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తే అక్కడ పరిస్థితి మరీ ఘోరం. బాలింతలు, శిశువులున్న వార్డులను మూడు పూటలా శుభ్రపరచాలి. లేదంటే శిశువులకు ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదముంది. అత్యవసరమైతే తప్ప సెలవులు తీసుకోలేని పరిస్థితి. అలాగని నిర్వాహకులను ఏమీ అనలేం. సిబ్బంది సరిపోక వారిపైన ఒత్తిడి ఉంటుంది. సిబ్బంది తక్కువైతే అధికారులకు వాళ్లు సమాధానం చెప్పుకోవాలి. తగినంత సిబ్బందిని నియమిస్తే కొంత ఉపశమనంగా ఉంటుంది.

చలివేంద్రం ముసుగులో ఆక్రమణకు స్కెచ్..?

వేసవి ముగిసి రెండు నెలలైనా టెంట్ తొలగించని నిర్వాహకులు



రెండు నెలలుగా ఖాళీగా ఉన్న చలివేంద్రం

గవర్నర్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వేసవి వెళ్లిపోయి, వర్షాలు మొదలై రెండు నెలలు గడుస్తున్నా లెనిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం టెంట్ మాత్రం నిర్వాహకులు తొలగించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. లెనిన్ సెంటర్, బీసెంట్ రోడ్డులో షాపింగ్‌కు వచ్చే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలు పార్కు చేసుకునేందుకు లెనిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని స్థానిక కబ్జాదారులు చలివేంద్రం పేరుతో దర్జాగా కబ్జా చేశారు. అప్పుడు టెంట్ వేసిన తరువాత దాహార్తులకు నీరు పోయడం 10 రోజులు మాత్రమే సాగిందని, అక్కడ నుంచి పూర్తిగా మూసేశారని స్థానికులు చెబుతున్నారు. చలివేంద్రం మూసివేసి 3 నెలలు కావస్తున్నా టెంట్‌ను తొలగించలేదు. ఈ టెంట్‌పై టీడీపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్ బొమ్మలు, పసుపు కటౌట్లు ఉండటంతో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మరోవైపు ఈ టెంట్ వేసిన స్థలానికి రేటు కట్టి తోపుడు బళ్లు పెట్టించేందుకు చోటా నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఒక బండి పట్టే ప్రాంతానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రేటు ఫిక్స్ చేశారని స్థానికులు చెబుతున్నారు. అధికార పార్టీ చోటా నేతలు బరి తెగించి ఆక్రమిస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మరోపక్క ప్రజా ప్రతినిధుల ఆశీస్సులతోనే ఈ ఆక్రమణల పర్వం కొనసాగుతోందని వామపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. లెనిన్ పార్కుకు ఉత్తరం వైపునున్న రోడ్డును ఆక్రమణదారులు పూర్తిగా ఆక్రమించి, పూలకొట్లు, చెప్పుల షాపులు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిటీ బస్సులు, ఆటోలు పెద్ద ఎత్తున తిరిగే ఈ రోడుపై ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఉన్నా స్థానిక ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని, పోలీసు ఔట్‌పోస్టు చుట్టూ కూడా ఆక్రమణలు పెరిగిపోయాయని వారు ఆరోపిస్తున్నారు.

అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తే ప్రధానం

జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ద్వారా వచ్చే అర్జీలను గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించడం ప్రధానమని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వే, పౌర సరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. భూ సేకరణ, రీ సర్వే, కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు, కొత్త రేషన్ కార్డులు, ఈకేవైసీ, ప్రజా పంపిణీ వ్యవస్థ సరుకుల పంపిణీతో పాటు పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సేవల దరఖాస్తులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొంటూ నాణ్యతతో సేవలందించాలన్నారు. జాతీయ రహదారులతో పాటు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ కార్యకలాపాల్లో వేగం పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) పటిష్ట అమలుకు చొరవ చూపాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీఓ కె.మాధురి, పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావు, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడీ పి.తివిక్రమరావు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

గాంధీనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని భారతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ (బీహెచ్‌ఆర్సీ) జాతీయ నేతలు తెలిపారు. సంస్థ రాష్ట్రస్థాయి కార్యకర్తలకు అవగాహన సదస్సు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బీహెచ్‌ఆర్సీ జాతీయ చైర్మన్ జవహర్లాల్ ఓజా, జాతీయ అధ్యక్షుడు పీ నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పీ జాన్ మాట్లాడారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్ బాషా, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ అడ్వకేట్ రాము, బీహెచ్‌ఆర్సీ లీగల్ సెల్ ఐ మధుబాబు ప్రసంగించారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల అభివృద్ధికి కృషి

గత వైసీపీ ప్రభుత్వం కాపులను పూర్తిగా విస్మరించిందని, దీంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు కాపు సామాజికవర్గం ఎనలేని కృషి చేసిందని కాపు రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. కూటమి గెలుపునకు కృషి చేసిన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. రాష్ట్రంలో కమ్మ, కాపు కులాల మధ్య వైరాన్ని తగ్గించి చిరకాలం మైత్రిని కొనసాగించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. 1988 వరకు మద్రాసు రాష్ట్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయా వర్గాలు కలిసి సోదరభావంతో ఉండేవన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ దిశగా చేస్తున్న ప్రయాణంలో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఇగ్నైట్‌సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. డీఆర్‌డీఏ ద్వారా అమలవుతున్న పథకాల వివరాలతో కూడిన పోస్టర్లను, కరపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో వచ్చిన వారిని ప్రోత్సహించి ఆ ఆలోచనలకు ప్రాజెక్టులుగా రూపమిచ్చేందుకు, పారిశ్రామిక యూనిట్లు స్థాపించేందుకు బ్యాంకింగ్ లింకేజీ, శిక్షణ తదితరాల ద్వారా చేయిపట్టి నడిపించేందుకు వీలుగా రోజుకో శాఖ కలెక్టరేట్‌లో ఇగ్నైట్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 2025-26లో స్వయం సహాయక సంఘాలకు దాదాపు రూ.675 కోట్ల మేర బ్యాంకు లింకేజీని లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, స్త్రీనిధి కింద రూ.133 కోట్లు, ఉన్నతి కింద రూ.9.70 కోట్లు లక్ష్యంగా ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఆర్థిక సాధికారత దిశగా నడిపించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందిన కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో కార్మిక శాఖ అధికారులు

కౌలురైతులకు వేగంగా రుణాలివ్వండి

సీసీఆర్‌సీ కార్డులున్న ప్రతి అన్నదాతకూ సత్వరం పంట రుణాలు మంజూరు చేయాలని, ఇందుకు ప్రతి బ్యాంక్ బ్రాంచ్‌లో క్రెడిట్ డే నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ బ్యాంకర్లకు సూచించారు. సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులకు సాగు రుణాల మంజూరుపై కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియాతో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు 56 వేల సీసీఆర్‌సీ కార్డుల జారీ లక్ష్యం కాగా ఇప్పటికే 42,415 కార్డులు అందించామని, వారికి సత్వరం బ్యాంకులు రుణాలందించేందుకు చొరవ చూపాలన్నారు. మెరుగైన పనితీరు కనబరిచిన బ్యాంకులు, బ్రాంచిలకు గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. చాలా అంశాల్లో ఎన్టీఆర్ జిల్లా ముందంజలో ఉందని, ఈ రుణాల మంజూరులోనూ జిల్లాను ముందు వరుసలో నిలపాలన్నారు. తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వివిధ పంటలకు బీమా పరిహారం పొందేందుకు అందుబాటులోని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్)ను రైతులు స్వచ్ఛందంగా సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించాలన్నారు. పంట రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్‌సెంటర్లు (సీఎస్‌సీ), బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి, జాతీయ పంట బీమా పోర్టల్ (ఎన్‌సీఐపీ)లో నమోదు చేసుకొని పథకంలో చేరవచ్చని కలెక్టర్ వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఎల్‌డీఎం కే ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, వివిధ బ్యాంకుల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

ఆర్థిక ప్రయోజనాల కోసం మనుషులను అంగడి సరుకుగా మార్చి క్రయవిక్రయాలను జరిపి మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై గట్టి నిఘా ఉంచి నివారణకు చర్యలు తీసుకొంటున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నల్గొండ జిల్లా నేరేడుగుమ్ము మండలంలో విముక్తి కలిగిన వెట్టి చాకిరీ కార్మికులను బుధవారం కార్మికశాఖ అధికారులు కలెక్టర్ లక్ష్మీశ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరీకి పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకొనేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. నేరుడుగుమ్ము మండలంలో విముక్తి కల్పించినవారిలో నలుగురు తాము విజయవాడకు చెందిన వారమని చెప్పడంతో ఎన్టీఆర్ జిల్లా కార్మిక శాఖ అధికారులకు అప్పగించారన్నారు. నగరానికి చెందిన దేవరగిరి శీలం వెంకయ్య వద్ద ఉన్న ఆధార్ సాయంతో అతడిని కుటుంబ సభ్యులకు అప్పగిసామని, గొల్లప్రోలు వెంకటేశ్వర్లు, బూక్యా వెంకన్న వద్ద ఆధార్ కార్డులు లేవని వారిని పూర్తిగా విచారించి వారి స్వస్థలాలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. పనులు ఇస్తామని చెప్పి వస్తే వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలని మోసపూరిత మాటలు నమ్మి వెట్టి చాకిరి ఉచ్చులో చిక్కుకోవద్దని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సీహెచ్ ఆషారాణి ఉన్నారు.

అన్నదాత సుఖీభవ కౌలు రైతులకే ముందు ఇవ్వాలి

- రాష్ట్ర కౌలు రైతుల సంఘం

కృష్ణలంక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సాగుచేయని భూ యజమానులకు ముందుగా అన్నదాత సుఖీభవ పథకం (పెట్టుబడి సాయం) ఇచ్చి సాగు చేసే కౌలు రైతులకు రెండో విడతలో ఇస్తామని చెప్పడం దుర్మార్గమని, వాస్తవంగా పంటలు పండించేది కౌలు రైతులేనని కాబట్టి భూమి లేని కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆగస్టు 2న అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ కాటమయ్య, పీ జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే విజయానంద్ రాష్ట్ర సచివాలయంలో అధికారుల సమీక్షలో మాట్లాడుతూ ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ పథకాల డబ్బులు మొదటి విడత విడుదల చేస్తున్నామని చెప్పారు. కానీ అందులో కౌలు రైతుల గురించి మాట్లాడుతూ రెండో విడత ఇస్తామని చెప్పడం సిగ్గుచేటని, భూమిలేని కౌలు రైతులందరికీ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వెబ్‌ల్యాండ్‌లో నమోదైన భూమి ఆధారంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అందించడమంటే భూ యజమానులకు అనుకూలంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో 70 నుంచి 80 శాతం సాగు భూమిలో పంటల పండిస్తున్నది కౌలు రైతులేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కౌలు రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే ఆగస్టు 2నే సాగుభూమి లేని కౌలు రైతులందరికీ పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని కాటయ్య, జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇప్పుడెందుకు ఇంత బాధ..!

- టీడీపీ నేతలను అక్రమ కేసులతో జైలులో పెట్టినప్పుడు తెలియలేదా..?
- మాజీ మంత్రి దేవినేని ఉమా

విజయవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులతో టీడీపీ నేతలను జైలులోపెట్టి హింసించినప్పుడు లేని బాధ వేలకోట్లు దోపిడీచేసిన తన భాగస్వాములు జైలుపాలయితే జగన్ గగ్గోలు పెడుతున్నారని టీడీపీ నేత, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలోని మీడియాతో మాట్లాడుతూ దోచుకున్న వేలకోట్లు కంటైనర్లలో ఎక్కడికి తరలించారో జగన్‌మోహన్‌రెడ్డి పెట్టబోయే యాప్ ద్వారా తెలపాన్నారు. అపార్ట్‌మెంట్లలో దాచిపెట్టిన రూ.500 నోట్లకట్టలను చూపించాలని ఆరోపించారు. వేలకోట్లను బంగారు బిస్కెట్లుగా ఎలా మార్చారో యాప్‌ద్వారా ప్రజలకు తెలిపాలన్నారు. గవర్నర్‌ను కలిసిన విషయం జగన్ ఎందుకు చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో బిగ్‌బాస్ జగనేనని, సీఎం సింగపూర్ పర్యటనపై జగన్ విషయం కక్కుతున్నారని ఆరోపించారు. వివేకా కేసులో ముద్దాయిలు ఎవరో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో పారిపోయిన కంపెనీలను సీఎం మళ్లీ రప్పిస్తుంటే జగన్ తట్టుకోలేకపోతురన్నారని దేవినేని విమర్శించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం విజయవాడ లబ్బీపేటకు చెందిన వేములపల్లి శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.1,01,116లు విరాళంగా దేవస్థానం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనం కల్పించారు. వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందచేశారు. అనంతరం ఏఈవో రమేష్ బాబు, అర్చకులు దాత కుటుంబానికి అమ్మవారి చిత్రపటం, విరాళం రశీదు, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో రమేష్ బాబు



సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

40వ డివిజన్‌లో ఇంటింటికీ టీడీపీ

విద్యాధరపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం 40వ డివిజన్ అధ్యక్షుడు పీవీ చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో డివిజన్‌లో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని, ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని సూచించారు. డివిజన్ నాయకులు గాడు గణేష్, జి.సురేష్, ఎం.నారాయణరావు, పి.వెంకటాద్రి, పి.నవీన్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణా నేరం

● డీసీపీ సరిత



మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిసున్న డీసీపీ సరిత, తదితరులు

విజయవాడ సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అడ్మిన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.జి.వి.సరిత సూచించారు. బాలలు, మహిళల అక్రమ రవాణాలకు వ్యతిరేకంగా కలిసి పోరాడదామని ఆమె పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణా నిర్మూలన దిశగా ప్రజలను చైతన్య పర్చేందుకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్(ఏహెచ్‌టీయూ), ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన పోస్టర్‌ను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీ బుధవారం ఆవిష్కరించారు. మానవ అక్రమ రవాణాపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వాసవి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ విజయవాడ కో ఆర్డినేటర్ అరవ రమేష్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్: బాలల అక్రమ రవాణా పెద్ద నేరమని విజయవాడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ ఎం. శైలజ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో విజయవాడ రైల్వే స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.శైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలల అక్రమ రవాణాను నిరోధించాలన్నారు. బాలల అక్రమ రవాణా సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లు 1800-1027-222, 0866-2470966లకు తెలియపరచాలని ఆమె తెలిపారు. వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ పిల్లలను అక్రమ రవాణాకు గురికాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాసవ్య మహిళా మండలి బాల కార్మికులను, పిల్లల అక్రమ రవాణా, బాల్య వివాహాల నుంచి సుమారు 237 మందిని కాపాడినట్లు ఆమె వివరించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ ఫతే ఆలీబేగ్, ఎస్ఐ ఎస్.ఎస్.రావు, వీఎంఎం పీడీ రామానుజయ్య, ఐసీడీఎస్ కౌన్సిలర్ జి.జీవన్, వాసవ్య మహిళా మండలి సభ్యులు జె.హృదయరాజు, ప్రసాద్, సౌజన్య, రేవతి, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు, వివిధ విభాగాల అధికారులు

జవహర్‌కు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సేవా సంఘం సత్కారం

ప్రభుత్వాసుపత్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో దంత విభాగంలో ఇటీవల నూతనంగా ఏర్పాటైన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దుశ్శాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.కన్నయ్య, వైస్ ప్రెసిడెంట్ సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శరత్, అశోక్ కుమార్, చెన్నకేశవలు తదితరులు పాల్గొన్నారు.

సొరంగంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయండి

● మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడకుండా సొరంగం లోపల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం చిట్టినగర్, కలరా హాస్పటల్, సితార సెంటర్, విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, వస్త్రలత, పంజా సెంటర్, గాంధీ హిల్ ఏరియా, రామరాజ్యనగర్, నాలుగు స్తంభాల సెంటర్, అంబేడ్కర్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చిట్టినగర్ సొరంగంలో పెయింటింగ్ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వన్‌టౌన్ ఫుట్‌బ్రిడ్జి పరిశీలించి ఇంకా మరమ్మతులు చేపట్టకపోవడంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్‌శాఖ సమన్వయంతో మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో లోపం ఉండరాదని, వస్త్రలత, సితార సెంటర్, చిట్టినగర్ కాంప్లెక్స్‌లో నగర పాలక సంస్థ కాంపెక్స్‌లో ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో త్వరగా మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్‌లో అన్న క్యాంటీన్ పరిశీలించి, తాగునీటి, వాడుకనీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, పాల్గొన్నారు.



వస్త్రలత కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

మట్టి మనిషి నాటిక ప్రదర్శన 2 , 3 తేదీల్లో

● అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్

గవర్నర్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట సుప్రసిద్ధ రచయిత వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో తలమానికంగా నిలిచిన మట్టిమనిషి నవలను నాటిక రూపంలో మలిచారని, ఆగస్టు 2, 3 తేదీల్లో విజయవాడలోని ఎంబీవీకేలో దీని ప్రదర్శిస్తున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్ తెలిపారు. ప్రదర్శనకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శన సాయంత్రం 5.30 నుంచి 3 గంటల పాటు సాగుతుందని, ఇది ఎంతో వ్యయప్రయాసలకు కూడుకున్నది కావడంతో ప్రవేశ రుసుము రూ. 100, ప్రత్యేక రుసుము రూ. 500గా నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు చంద్రా నాయక్, గోళ్ల నారాయణరావు, మోతుకూరి అరుణ్‌కుమార్, గుండు నారాయణ, బి. జయప్రకాష్, బొర్రా నరేష్, యువీ స్వామి, బి. పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మట్టి మనిషి నాటికకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

నేటితో ముగియనున్న కుంభాభిషేక మహోత్సవాలు

లబ్బీపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పున్నమ్మతోట లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు గురువారంతో ముగియనున్నాయని ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున బుధవారం తెలిపారు. 5,000 మందికి అన్నప్రసాద వితరణతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి అష్టబంధన మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం సాయంత్రం విశేష మహాశాంతి, తిరుమంజనం, ధాన్యాధివాసం, సర్వదైవత్య హోమాలు జరిగినట్లు తెలిపారు. 31న మహాపూర్ణాహుతి, ఆలయప్రవేశం, కుంభాత్ బింబ సహారోహణం, కళావాహనం, ప్రథమ కళార్చనం, మహాసంప్రోక్షణ, అక్షతాంరోహణ కార్యక్రమాలు జరుగుతాయని, బ్రహ్మఘోషతో కార్యక్రమం ముగియనున్నట్లు తెలిపారు.



ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

'ఉప్పలపాటి'ని ఆదర్శంగా తీసుకోవాలి

● సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

వన్‌టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నేటి తరం రాజకీయ నాయకులు, సీపీఐ మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రామచంద్రరాజును ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు సూచించారు. బుధవారం వన్‌టౌన్ లెనిన్‌భవన్ వద్ద ఉప్పలపాటి రామచంద్రరాజు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జి.కోటేశ్వరరావు, పలువురు ముఖ్య నాయకులు రామచంద్రరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు నిలువుటద్దం కమ్యూనిస్టుల నాయకుడు ఉప్పలపాటి రామచంద్రరాజు అని కొనియాడారు. నగరంలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. నగరపార్టీ సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.రమణారావు, తాడిపైడయ్య, పంచదార్ల దుర్గాంబ, డి.వి.రమణబాబు, నక్కా రాజ్యలక్ష్మి, ఎస్.కె.నజీర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జి.కోటేశ్వరరావు



రాయల్ స్కూల్‌లో ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న వీఎంసీ ఫైర్ సిబ్బంది

అగ్నిమాపక అధికారుల ఆకస్మిక తనిఖీలు

గవర్నర్‌పేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను నిరోధించేందుకు వీఎంసీ ఫైర్ ఆఫీసర్స్, సిబ్బంది బుధవారం సూర్యారావుపేటలోని ఎన్ఏఎస్ఏ ఆసుపత్రి, విద్యాధరపురంలోని రాయల్ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఫైర్ సిబ్బంది అగ్రిప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, పరికరాలు వినియోగించే విధానం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి తదితర విషయాలపై సంస్థల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి మాల్యాద్రితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లొద్దు

● పశ్చిమ తహసీల్దార్ ఇంతియాజ్ పాషా

భవానిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు కృష్ణానదిలోకి వేటకు వెళ్లొద్దని పశ్చిమ తహసీల్దార్ ఇంతియాజ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు వస్తున్నందున సిబ్బందిని అప్రమత్తం చేశామని ఆయన తెలిపారు. పులివెందుల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజీకి 65 వేల క్యూసెక్కుల వరదనీరు విడుదల చేశారన్నారు. 3 లక్షల క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారన్నారు. 24 గంటలు పశ్చిమ తహల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇసుక బస్తాలు, ఇతర రక్షణ చర్యలు చేపట్టేల స్థానికంగా ఏర్పాట్లు, నదిలోకి మత్స్యకారులు, సామాన్య ప్రజలు ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

భూ బాధితులకు అండగా ఉంటాం

● మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్

భవానీపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పశ్చిమలోని జోజినగర్ ఆర్టీసీ సుబ్బారావు ప్లాట్ల యజమానులు అధైర్యపడొద్దని, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ భరోసా ఇచ్చారు. బుధవారం కూటమి నేతలతో కలిసి 45 వ డివిజన్ జోజినగర్‌లోని 42 ప్లాట్ల వద్ద నిరసన తెలియజేస్తున్న బాధితులకు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ సీనియర్ నాయకులు మైలవరపు కృష్ణ తో కలిసి జలీల్‌ఖాన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ అమాయకులైన 42 కుటుంబాలు గత 28 రోజులుగా తమకు దక్కవలసిన ప్లాట్ల కొరకు న్యాయపరంగా ఆందోళన చేస్తున్నారని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉందని భరోసా ఇచ్చారు. పశ్చిమంలో దందాలు, చందాలు లేకుండా రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి పాలన ఉందని బాధితులకు ఆయన అండగా ఉన్నారని తెలిపారు. మీడియా మిత్రులు సైతం స్వచ్ఛందంగా ముదుకు వచ్చి 42 మంది బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుజనా చౌదరీ కలెక్టర్‌కు, కమిషనర్ కు తెలియజేశారన్నారు. కూటమి నేతలు రాంపల్లి శ్రీనివాస్, సయ్యద్ సలీం, ప్రసాద్ బాబు, పత్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ స్థానిక నాయకులు



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాలను అందజేసిన అడ్డూరి శ్రీరామ్, ప్రత్తిపాటి శ్రీధర్‌లు

బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేత

విద్యాధరపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో బుధవారం పలువురు బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌తో కలిసి అందజేశారు. 42వ డివిజన్ భవానీపురంలో ఉంటున్న భక్తుల రాముకు రూ.లక్షా 60వేలు, 37వ డివిజన్ సామారంగం చౌక్‌కు చెందిన సామా బాలాజీకి రూ.6లక్షలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ పత్రాలను అడ్డూరి శ్రీరామ్, శ్రీధర్‌లు బాధితుల కుటుంబ సభ్యులకు అందచేశారు. కూటమి నాయకులు, సుజనామిత్ర కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు రద్దు అన్యాయం

● సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు బోయ సత్యబాబు



38వ డివిజన్ శానిటేషన్ కార్యాలయం వద్ద గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బోయ సత్యబాబు

వన్‌టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు సంక్షేమ పథకాలను రద్దు చేయటం అన్యాయమని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు బోయ సత్యబాబు ఆరోపించారు. బుధవారం 38వ డివిజన్ శానిటేషన్ కార్యాలయం వద్ద సీఐటీయూ సర్కిల్ -1 కార్యదర్శి బి.సాములు ఆధ్వర్యంలో కార్మికుల గేట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో బోయ సత్యబాబు మాట్లాడుతూ కార్మికుల హక్కులను, పనిగంటలను హరించి వేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని సూచించారు. పెంచిన కరెంటు చార్జీలు, అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల, ప్రజావేదిక ఆగస్టులో నిర్వహించే ప్రజా పోరాటాలలో కార్మికులంతా కలిసికట్టుగా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.లక్ష్మి, చంద్ర, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి

ప్రభుత్వాసుపత్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కఠినమైన శ్రమ, నిబద్ధత, నిజాయితీతో చదువుపట్ల మనసుపెట్టి రాణించాలని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ఏడుకొండలరావు సూచించారు. కాలేజీలోని 38వ ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్(ఐఏపీ), యూజీ క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీడియాట్రిక్స్ విభాగం సంయుక్తంగా మెడికల్ విద్యార్థుల్లో క్లినికల్ పరిజ్ఞానం, ఆసక్తిని పెంపొందించేందుకు అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి క్విజ్‌పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన డాక్టర్ జయంత్, డాక్టర్ రాజీనీస్ చంద్రను అభినందించి, బహుమతులు ప్రదానం చేశారు. రాబోయే డివిజనల్ స్థాయి పోటీల్లో తమ సంస్థ ప్రాతినిధ్యం వహించనుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ అనిల్, విభాగానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి : సౌమ్య



నందిగామ, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. మునిసిపల్ నిధులు రూ.15 లక్షలతో తొమ్మిది కిలోమీటర్ల మేర డ్రెయిన్ల పూడికతీత పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణిశ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఏచూరి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

రెండు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

విస్సన్నపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): 3, 4 వార్డుల పరిధిలో పాత పోస్టాఫీసు రోడ్డులో రెండు దశాబ్దాలుగా ప్రజలు సరైన రహదారి లేక ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదేశాలలో ఉపాధి నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. బుధవారం పనుల్ని టీడీపీ నాయకులు పరిశీలించారు. వార్డుల్లో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తెల్లదేవరపల్లి నాగరాణి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

వృద్ధురాలి నేత్ర దానం

గంపలగూడెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): గంపలగూడేనికి చెందిన గుడివాడ వెంకటకుమారి(72)బుధవారం మృతి చెందారు. తిరువూరు లయన్స్ క్లబ్ అడ్వకేట్ గోగిరెడ్డి కృష్ణారెడ్డి చొరవతో కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను ఎల్వీ ప్రసాద్ వైద్యశాలకు దానం చేశారు.

అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

తిరువూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.మనోజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసుకున్నవారు, అక్టోబరు 24 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

మానవ అక్రమ రవాణా పెరగడం బాధాకరం



తిరువూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంటే, మరోవైపు మానవ అక్రమ రవాణ పెరగడం అత్యంత బాధాకరమని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్యతేజ అన్నారు. బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీవాహిని ఇంజనీరింగ్ కాలేజీలో మానవ అక్రమ రవాణాపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు, ఏజీపీ రాము, న్యాయవాది మేకల నాగేంద్రప్రసాద్, సెక్టార్-1ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ, జనార్దనరావు, రేగళ్ల పాల్గొన్నారు.



రహదారిని పరిశీలిస్తున్న దాత వేములపల్లి విజయ్ రామ్‌ప్రసాద్ (ఆర్పీ)

సొంత నిధులతో రోడ్లకు మరమ్మతులు

ఇబ్రహీంపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): గొల్లపూడి ల్యాంకో కాలనీలో అధ్వానంగా ఉన్న రెండు రహదారులను సాయిపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేములపల్లి విజయ్ రామ్‌ప్రసాద్ తన సొంత నిధులు రూ.72 వేలతో బుధవారం బాగు చేయించారు. జీఐజీ స్కూల్ వద్ద ఉన్న శ్రీసాయి శ్రీనివాస రెసిడెన్సీ రోడ్డులో వర్షాలకు నీళ్లు నిలుస్తున్నాయని, టైర్స్ గోదాం వద్ద రహదారి అధ్వానంగా ఉందని కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన అసోసియేషన్ సభ్యులతో సమావేశమై రెండు రోడ్లకు మరమ్మతులు చేయించారు. కాలనీ వాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జి.సత్యనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

ఏటిపట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయండి

ఇబ్రహీంపట్నం : కృష్ణానదికి ఎగువ నుంచి వరద వస్తున్న నేపథ్యంలో ఏటిపట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం నదీ పరివాహక ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

టీటీడీ నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయలు




విస్సన్నపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో 10 టన్నుల కూరగాయలు, ద్వారకా తిరుమల ఆలయానికి 3.5 టన్నుల కూరగాయలను బుధవారం భక్తులు పంపారు. కాకతీయ కమ్మ సేవా సమితి అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు కూరగాయల లారీకి జెండా ఊపి సాగినంపారు. కె.ఎస్.చక్రవర్తి, శ్రీరామచంద్ర, వెల్ది రామారావు, మండడపు వెంకటేశ్వరరావు, కవులూరి రాజ, వీరమాచినేని శ్రీను, నాదెళ్ల నాగమణి, నెక్కళపు వాణిశ్రీ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా బాచుపేట మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన దామలూరి రమేష్ మాధవీలతా దంపతులు రూ.51 వేలు విరాళమిచ్చారు. నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎం.నరసయ్యకు బుధవారం అందజేశారు. దాతలకు అమ్మ, స్వామివారి శేష వస్త్రం ప్రసాదాలను అధికారులు అందజేశారు.

పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

రెడ్డిగూడెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని నిర్మూలించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పర్చేందుకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కూనపరాజుపర్వ గ్రామంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. తొలుత గ్రామంలో విద్యుత్ లైన్ల పునర్వ్యవస్థీకరణ పనుల్ని ప్రారంభించారు.



రెడ్డిగూడెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కరపత్రాలను పంచుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

రైతులకు మెరుగైన సేవలందించాలి

రైతులకు మెరుగైన సేవలందించాలని పీఏసీఎస్ త్రీ మ్యాన్ కమిటీలకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచించారు. పీఏసీఎస్ రెడ్డిగూడెం చైర్మన్‌గా ఉయ్యూరు సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులుగా చేపలమడుగు కాంతారావు, బలగాని గోపి, కూనపరాజుపర్వ పీఏసీఎస్ చైర్మన్‌గా రాయుడు వెంకటేశ్వరరావు, సభ్యులుగా పాలంకి గోపాల్ రెడ్డి, సంగం శివ ప్రమాణస్వీకారం చేశారు. అక్కుల రామ్మోహన్‌రావు(గాంధీ), ముప్పిడి నాగేశ్వరరెడ్డి, నాదెళ్ల చెన్నకేశవరావు, జానలపాటి వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు రేగళ్ల రఘునాథ రెడ్డి, పాములపాటి సుందరరావు, డీసీ చైర్మన్ కొల్లి శ్రీనివాసరెడ్డి, పైడిమర్ల కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండపల్లి 9వ డివిజన్‌లో..



పెనుగంచిప్రోలులో ..

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ 9వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ నేతలతో కలిసి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య నిర్వహించారు. మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, దారు నాయక్, నరసయ్య, పులిదాసు, మేడా శ్రీనివాసరావు, డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లంక లితీష్ ఆధ్వర్యంలో..


మైలవరం: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పెద్ద హరిజనవాడలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంక లితీష్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

పెనుగంచిప్రోలు: బీసీలకు అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ పేరేపి అన్నారు. పెనుగంచిప్రోలులో టీడీపీ మండల అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గజ్జి కృష్ణమూర్తి , జిల్లేపల్లి సుధీర్‌బాబు, బాడిస మీరయ్య, వరికల్లు గోపాలరావు, గుగ్గులోతు రమేష్ నాయక్, చుంచు రమేష్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం : మునిసిపల్ చైర్మన్

జగ్గయ్యపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పురపాలకసంఘ పరిధిలో వీధి దీపాలకు, మంచినీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, కౌన్సిలర్లు తమ వార్డుల్లో అవసరమైన చోట వీధి దీపాలు వేయించుకోవాలని మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సూచించారు. బుధవారం చైర్మన్ అధ్యక్షతనకౌన్సిల్ సమావేశం నిర్వహించారు. డీఎంఎఫ్, 16వ ఆర్థిక సంఘం నిధులు, సీఆర్డీయే నిధుల టెండర్లు పిలిచామని త్వరలోనే ప్రక్రియ ప్రారంభమవుతుందని చైర్మన్ తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కొందరు రోజుల తరబడి విధులకు హాజరు కావటం లేదని హాజరు కాని వారిని ఉపేక్షించవద్దని వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కోరారు. రాజకీయంగా మద్దతు ఉన్న సిబ్బంది వల్లనే ఈ సమస్య వస్తుందని కౌన్సిలర్ నకిరికంటి వెంకటి అన్నారు. క్రిస్టియన్‌పేటలో మందుబాబుల ఆగడాలు పెరిగిపోయాయని, మహిళలు బయటకు రావాలంటే భయపడుతున్నారని కౌన్సిలర్ సుందరమ్మ చైర్మన్ దృష్టికి తెచ్చారు.



పీ-4 పథకానికి సహకరించండి

జగ్గయ్యపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పీ-4 పథకానికి సహకరించాలని, ఒక్క కుటుంబాన్ని దతత్త తీసుకోవాలని పట్టణ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, పాన్ బ్రోకర్స్‌ను ఆర్డీవో బాలకృష్ణ కోరారు. నందిగామలోని తన కార్యాలయంలో పీ-4పై వ్యాపారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో బాలకృష్ణను వ్యాపారులు సత్కరించారు. చింతా శేషానందం, యర్రం శివప్రసాద్, జంగాల నాగరాజు, రంగాపురం శ్రీనివాసరావు, చౌడవరపు చిన్న మల్లయ్య, శ్రీరాం సీతారామమ్మూర్తి పాల్గొన్నారు.



మెకానిక్ ఆత్మహత్య

నందిగామ, జూలై 30(ఆంధ్రజ్యోతి): కారు మెకానిక్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన అనిల్ స్థానికంగా ఒక షెడ్డులో పని చేస్తున్నాడు. ఒంటరిగా నెహ్రూనగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. బుధవారం ఆయన ఉరేసుకుని మృతి చెందాడు. సీఐ వైవీవీఎల్ నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రేమ వ్యవహారమే కారణన్న అనుమానంతో కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలియజేస్తామని సీఐ తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడి..

తిరువూరు : అక్కపాలెంలో మానసిక స్థితి సరిగా లేని రావూరి నాగరాజు(30)మంగళవారం అర్ధరాత్రి తన ఇంట్లో కత్తితో పొడుచుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..'గ్రామంలో కూలి పనులు చేసుకునే నాగరాజు అవివాహితుడు. తండ్రి గతంలో మృతిచెందాడు. నాగరాజు మానసికస్థితి సరిగా ఉండడం లేదు. తన ఇంట్లోని గదిలోకి వెళ్లి కత్తితో పొడుచుకుని కేకలు వేశాడు. తల్లి రావూరి మాణిక్యం స్థానికుల సహాయంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఆప్త మిత్రుడికి ఘన నివాళి



విస్సన్నపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అకాల మరణం చెందిన గోగులమూడి భువనేశ్వరరెడ్డి దశదిన కర్మ బుధవారం ఆయన నివాసంలో జరిగింది. ఆయన చిత్రపటానికి స్నేహితులు, గ్రామస్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మొక్కలు పంచారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు నెక్కళపు వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, అనుమోలు శివబాజీ, అర్జునరావు, తీగల మురళీకృష్ణ, నరేష్, పలువురు పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

జగ్గయ్యపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తాగుడు, ఇతర దుర్వ్యసనాలకు బానిసై భార్యను డబ్బుల కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.రాజు తెలిపారు. చెరువుబజార్‌కు చెందిన సత్యవతి (34) పదిహేనేళ్ల కిత్రం తక్కెళ్లపాడుకు చెందిన రెమిడాల వెంకటేశ్వర్లు(40)ను ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. కొంతకాలంగా వెంకటేశ్వర్లు తాగుడు ఇతర దుర్వ్యసనాలకు బానిసై డబ్బుకోసం భార్యను వేధిస్తున్నాడు. సత్యవతి ఫిర్యాదుపై వెంకటేశ్వర్లు అతనికి సహకరిస్తున్న సోదరిలు ముత్యాలు, ఆరోగ్యంపై గృహ హింస, వేధింపుల కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



కేతనకొండలో డ్రమ్ సీడర్ పనితీరును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వ్యవసాయ సిబ్బందికి ముగిసిన శిక్షణ

ఇబ్రహీంపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన సహాయకులకు, వ్యవసాయశాఖ సిబ్బందికి కేతనకొండ రైతు సేవా కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. జీవామృతం తయారీ, ఏటీఎం విధానంలో 20 రకాల దుంప జాతుల కూరగాయలు, తృణధాన్యాల సాగుపై అధికారులు శిక్షణ ఇచ్చారు. డ్రమ్ సీడర్ ద్వారా వరి, పెసర, మినుము, కూరగాయల విత్తనాలు విత్తే విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారిణి విజయకుమారి, డీపీఎం శంకర్‌నాయక్, విజయవాడ డివిజినల్ సహాయ సంచాలకుడు బొడ్డపాటి వెంకటేశ్వరరావు, ఏవో రజని తదితరులు పాల్గొన్నారు.

పంటల క్షేత్రస్థాయి పరిశీలన

తిరువూరు : ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న డివిజన్ పరిధిలోని రైతుసేవా కేంద్రం సిబ్బందికి బుధవారం క్షేత్రప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీపురంలో రైతు బి.సురేష్ తన పొలంలో వేసిన 30 రకాల నవధాన్యాల విత్తనాల మొలకలను పరిశీలించారు. టెక్నికల్ ఏవో టిప్పుసుల్తాన్, ఏవో సాయిశ్రీ, సిబ్బంది వాణి, నాగేశ్వరమ్మ, ప్రశాంత్, సతీష్, స్వాతి, చిదంబరం పాల్గొన్నారు.



